# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 137 | విశాఖపట్నం | 17-2-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue :137 | VISAKHAPATNAM | 17-2-2026 TUESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు


9516171797, 9491286902




2లో

నేడు మోడీతో మాక్రాన్ భేటి

## పోషకాలకు చెందిన సప్లిమెంట్లను తీసుకుంటున్నారా? అయితే జాగ్రత్త!



6లో




3లో

కల్యాణపులోవ జలాశయంలో భక్తుల పుణ్యస్నానాలు

# ముగిసిన బిల్ గేట్స్ పర్యటన

## అయిదున్నర గంటలపాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న బిల్‌గేట్స్





**అమరావతి, పతాకం న్యూస్:** బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటన ముగిసింది. విజయవాడ నుంచి ముంబై మీదుగా దిల్లీకి వెళ్లనున్నారు. దాదాపు ఐదున్నర గంటల పాటు వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడారు. బిల్ గేట్స్ అమరావతి పర్యటన సందర్భంగా సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్ 2047, ప్రభుత్వ పాలసీలు, లక్ష్యాలు, కార్యక్రమాలపై బిల్ గేట్స్‌కు సీఎం ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ-దిశ ఏర్పడుతుందని చంద్రబాబు ఆకాంక్షించారు. బిల్ గేట్స్‌తో తన అనుబంధాన్ని సమావేశంలో ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. 1997లో మొదటిసారి బిల్ గేట్స్‌ను కలిసిన సంగతి, హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు జరిగిన విధానాన్ని గేట్స్ సమక్షంలో గుర్తు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. ఏపీలోని వివిధ ప్రాజెక్టులకు గేట్స్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. వైద్యరంగంలో తెచ్చిన మార్పులు-సాధించిన ఫలితాలపైనా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బిల్ గేట్స్ అమరావతి పర్యటన చారిత్రాత్మకమన్న సీఎం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఈ పర్యటన దోహదం చేస్తుందని అన్నారు. నాడు మైక్రోసాఫ్ట్ రాకతో ఐటీ రంగంలో హైదరాబాద్ మేటిగా నిలబడిందని తెలిపారు. ఏపీలో అన్ని వనరులు (తరువాయి 2వ పేజీలో)

### గేట్స్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యానికి


# ఆంధ్రప్రదేశ్ సిద్ధం: లోకేశ్



**అమరావతి, పతాకం న్యూస్:** గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. బిల్ గేట్స్‌కు అమరావతి హృదయ పూర్వక స్వాగతం పలుకుతోందని ఆయన పేర్కొన్నారు. గన్నవరం విమా నాశ్రయంలో బిల్ గేట్స్‌ను సహచర మంత్రులతో కలిసి సాదరంగా స్వాగతిం చడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్‌తో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతిక ఆధారిత పరిపాలన రంగాల్లో భాగస్వా మ్యాలను మరింత బలోపేతం చేసే అంశాలపై సచివాలయంలో చర్చిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ప్రజలకు పటిష్టమైన, అత్యంత ప్రభావం కలిగించే పరిష్కారాలను అందించేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో సన్నిహితంగా పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ ఎదురు చూస్తోందని లోకేశ్ తెలిపారు.

### ఏపీ అభివృద్ధికి గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం

# కీలక మలుపు: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమ రావతిలో గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ పర్యటన రాష్ట్రానికి ప్రాముఖ్యతను తెచ్చిపెట్టింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ట్విట్టర్ (ఎక్స్)లో ట్వీట్ పెట్టారు. అమరావతి పర్యటనలో భాగంగా బిల్‌గేట్స్‌కు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డుతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి బిల్‌గే ట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు విశేషమని పవన్ కల్యాణ్ కొనియాడారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యానికి చూపుతున్న నిబద్ధతను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించబోతోందని పేర్కొన్నారు. విద్యారంగంలో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం విద్యా ర్థులకు ఆధునిక విద్యను అందిం చడంలో సహాయపడుతుందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ ఆధారిత విద్య, డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన వంటి విధానాలు విద్యార్థుల నైపుణ్యాలను పెంచడంలో కీలకంగా ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతా ల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కూడా ఈ భాగ స్వామ్యం ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించబోతోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గేట్స్ ఫౌండేషన్ అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడు తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించడం, టెక్నాలజీ ఆధారిత ఆరోగ్య సేవలను అందించడం వంటి అంశాల్లో భాగస్వామ్యం కీలకమని అన్నారు. వ్యవసాయ రంగంలో కూడా గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం రైతులకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత వ్యవసాయం, డ్రోన్ వినియోగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పంటల విశ్లేషణ వంటి విధానాలు రైతుల ఆదాయాన్ని పెంచడంలో సహాయపడతాయని చెప్పుకొచ్చారు.

## మరింత తగ్గిన బంగారం, వెండి ధరలు



**ముంబై:** అంతర్జాతీయ వాణిజ్య లావాదేవీల సెటిల్‌మెంట్లు డాలర్లలో నిర్వహిం చేందుకు రష్యా సిద్ధమవు తుండడం బంగారం, వెండి లోహాల ధరలను గణనీయంగా తగ్గిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. పది గ్రాముల బంగారం ధర మళ్లీ లక్ష రూపాయల దిగువకు వస్తుందని అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో బంగారం ధర సోమవారం గ్రాముకు రూ.1300కు పైగా తగ్గింది. వెండి కిలోకు రూ.7000 మేర తగ్గింది. మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,56,440కి చేరింది. నిన్నటి ధరతో పోల్చుకుంటే 1,310 రూపాయలు తగ్గింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,43,400కి చేరింది.


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## అధిపత్యం!

అమెరికా పాత్ర ప్రత్యేకించి అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పాత్ర అంతకంతకూ ఒక "బుల్డోజర్" తరహాలోకి మారిపోతున్నది. బుల్డోజర్లను ఏకపక్షంగా ప్రయోగించి బలహీనులూ, ఏ రక్షణ లేని వారి హక్కులను ఎలా కాలరాస్తారో భారతదేశం లోని మనకు ఇప్పుడు బాగా తెలుసు. మెజారిటీతో విర్రవీగే వాతావరణంలో ఈ విధంగా నగంగా దురాక్రమణకు పాల్పడటం సోషల్ మీడియా వరణంలోని భక్తగణాల నుంచి భారీ ప్రశంసలు తీసుకు వస్తుంది. అయితే అంతర్జాతీయ రంగంలో అదే విధమైన ధోరణి వల్ల రాజకీయంగా తీవ్ర నష్టం, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి కోల్పోవడం మాత్రమే జరుగుతుంది. ఇది దేశ సార్వభౌమత్వానికి హానికరమైంది. బయటి ప్రపంచంతో భారత దేశ సంబంధాల నిర్వహణలో గత కొంత కాలంగా జరుగుతున్నది కచ్చితంగా ఇదే. పహల్గాం దాడి, పాకిస్తాన్‌పై తదనంతర సైనిక ఘర్షణ నాటి నుంచి ఇది మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. భారత, పాకిస్తాన్‌లుగా తాము లోతుగా పరిశీలించిన తర్వాతనే ఈ విరమణ జరిగిందన్న భారతదేశ ప్రకటనకు అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా చేసిన ప్రకటన పూర్తి విరుద్ధంగా తయారైంది. ఏమైనా ఇరు దేశాలు అధికారికంగా ఫలితం ప్రకటించే లోపుగానే ట్రంప్ హడావుడిగా చేసిన ప్రకటనతో ద్వైపాక్షిక సమస్యల్లో తృతీయ దేశాల జోక్యానికి చోటు ఇవ్వబోమన్న మన పవిత్రమైన వచనాలను పచ్చిగా వమ్ము చేసినట్టయింది. అయితే భారత పాలనా వ్యవస్థ ఇప్పటికీ అదే మాట అంటున్నది. ఇప్పటికి కొంత కాలంగా భారత విదేశాంగ విధానం అమెరికా గొంతెమ్మ కోర్కెలకు బందీ అయిపోయిందని స్పష్టమవుతూ వస్తోంది. మోడీ సర్కారులో అది మరింత బాహాటంగా నడుస్తున్నది. వ్యవసాయం, నియంత్రణలు, డిజిటల్ విధానం, భద్రతా పొత్తులపై భారత అమెరికా వాణిజ్య ఒప్పందం ఇందుకు గట్టి సాక్ష్యం. అమెరికా విడుదల చేసిన అధికారిక ప్రకటన దీన్ని మరింతగా నిరూపించింది. 'రష్యన్ ఫెడరేషన్ నుంచి అమెరికాకు ఎదురవుతున్న ముప్పును తట్టుకోవడం కోసం సుంకాలను సవరిస్తూ అధ్యక్షుడు చేపడుతున్న చర్యలపై అధికారిక ఉత్తర్వులు' అనే పేరుతో 2026 ఫిబ్రవరి ఆరున అది విడుదలైంది. భారత అమెరికా వాణిజ్య ఒప్పందం పరిధిని అధికారికంగా అమెరికా భారత ప్రభుత్వాలు 2026 ఫిబ్రవరి 7న తెల్లవారుఝామున విడుదల చేశాయి. అంతర్జాతీయ రంగంలో భారత దేశం ఎదుర్కొంటున్న మధ్యకాలిక, తక్షణ నేపథ్యాలు ఈ పత్రాలకూ సంబంధం లేదన్న భ్రమ కలగడానికి ఇది కారణం కావచ్చు. తన వాణిజ్య వ్యవసాయ రంగాల కోసం అనుసరిస్తున్న విధానాల కారణంగా ఇటీవలి కాలంలో అంతర్జాతీయ చర్చలలో భారత దేశం టారిఫ్ రాజుగా చిత్రించబడింది. అయితే టారిఫ్‌లతో సహా అంతర్జాతీయ వ్యవసాయ రక్షణ విధానాలను మొత్తంగా పరిగణించేట్టయితే అత్యధికమైన అభేద్యమైన టారిఫ్ సబ్సిడీ గోడలు కట్టింది. అన్యాయమైన టారిఫ్ యేతర అడ్డంకులు సృష్టించిందీ అత్యధికంగా ధనిక దేశాలే. జాతీయ ఉత్పత్తిలో వ్యవసాయం వాటా గణనీయంగా తగ్గిపోతున్నది. అదే సమయంలో వ్యవసాయంపై ఆధారపడిన జనాభా శాతం చెప్పుకోదగినంతగా ఏమీ తగ్గడం లేదు. ఇలాంటి సమయంలో ఏ అంతర్జాతీయ ఒప్పందాన్నయినా కేవలం షరతులలో ఒక అంశంగా చూడకూడదు. కోట్లాది మంది చిన్న మధ్యతరహా రైతుల జీవనోపాధి సమస్యగా దాన్ని చూడవలసి వుంటుంది. వారు చిరు ఉత్పత్తిలో పాల్గొంటుంటారు. అయితే సబ్సిడీలు, ఆహార భద్రత అనివార్య అవసరాల కోసం భారతీయ రైతులను కాపాడేందుకు తీసుకునే ఎలాంటి చిన్న చర్యనైనా సరే వాణిజ్యపరంగా చిత్రించడం, టారిఫ్ టారిఫేతర అడ్డంకిగా ప్రతికూల ముద్ర వేయడం జరుగుతున్నది. కాని వాస్తవం పూర్తిగా భిన్నంగా వుంది. సగటున 39 శాతం వున్న భారతదేశ వ్యవసాయ టారిఫ్‌లనే అత్యధికమైనవిగా, దారుణంగా చిత్రించేట్టయితే అప్పుడు సంపన్న దేశాలు నిస్సందేహంగా రక్షణ విధానాలలో మరింత పెద్ద మొనగాళ్లుగా చెప్పాల్సి వుంటుంది. తృణధాన్యాలు, పాడి ఉత్పత్తులపై అమెరికా ఏకంగా 188 శాతం పైన టారిఫ్‌లు విధిస్తుంది. భారత్‌కు వ్యతిరేకంగా అమెరికా సృష్టించిన ఇలాంటి టారిఫ్ టెర్రర్‌పై దుష్ప్రచారానికి తోడు దానికి 4500 కోట్ల డాలర్ల వాణిజ్య మిగులు కలిగివుందనే ఫిర్యాదు లేవనెత్తింది. ఆ పేరుతో భరించలేని స్థాయిలో 25 శాతం టారిఫ్‌లను విధించింది. రష్యా నుంచి చమురు సహజ వాయువు తీసుకుంటున్నందుకు వేసిన శిక్ష అంటూ తర్వాత మరో 25 శాతం అదనపు టారిఫ్ విధించి 50 శాతానికి చేర్చింది. ఇక్కడ వాస్తవాలు స్పష్టంగానే వున్నాయి. అమెరికా సరుకులపై భారత దేశం విధించే టారిఫ్ 0 నుంచి 3 శాతం వుంటే భారతీయ సరుకులపై అమెరికా విధించే టారిఫ్ గతంలో ప్రతిపాదించిన 50 శాతం గాక 18 శాతానికి పెంచబడింది. ట్రీ నట్స్ (జీడిపప్పు, బాదంపప్పు తదితరాలు), పశుగ్రాసం, ఎర్రజొన్నలు, తాజా-ప్రాసెస్ చేసిన పండ్ల వంటి వాటిపై భారత అమెరికా ఒప్పందం ఆ దేశ ఉత్పత్తులకు కొత్త మార్కెట్ సమకూర్చి పెడుతుందనేది తెలుస్తూనే వుంది. అమెరికా వ్యవసాయ మంత్రి బ్రూక్ రోలిన్స్ ట్రంప్‌నకు ధన్యవాదాలతో మాట్లాడిన దానిలో ఇదే నొక్కి చెప్పారు. "మరోసారి మన అమెరికా రైతులకు మేలు చేసినందుకు కృతజ్ఞతలు. దీంతో మనం భారత దేశపు విస్తార మార్కెట్లకు మరిన్ని వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేయవచ్చు. వాటి రేట్లు పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లోకి నగదు ప్రవహించడం జరుగుతుంది.

గ్రేట్ వర్క్'... ఏపీ ప్రభుత్వంపై

## బిల్ గేట్స్ ప్రశంసలు



**అమరావతి, పతాకం న్యూస్:** గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్‌ను సీఎం చంద్రబాబుతో కలిసి సందర్శించారు. ఆర్టీజీఎస్ సెంటర్‌లో ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని దగ్గరుండి పరిశీలించారు. డేటా లేక్, అవేర్ 2.0, వాట్సాప్ గవర్నెన్స్, సంజీవని ప్రాజెక్టు, అమరావతి నిర్మాణం వంటి అంశాల గురించి బిల్ గేట్స్ కు చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్ మాట్లాడుతూ... డేటా లేక్ ద్వారా అన్ని శాఖలను అనుసంధానం చేయడం, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను సులభతరం చేయడం చాలా బాగుందని ప్రశంసించారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్ సమాచారం సేకరించి వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్న తీరు, కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ద్వారా జీఎస్‌డీపీ పెరుగుదలను అంచనా వేస్తున్న విధానం కూడా గేట్స్‌ను ఆకట్టుకున్నాయి. ఆర్టీజీఎస్ లోని డిస్ ప్లే వాల్స్ పై ప్రెజెంటేషన్లను ఆయన పరిశీలించారు. ప్రాపర్టీ రికార్డుల భద్రత కోసం బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్ వంటి విధానాలు అమలు చేస్తున్న తీరును గేట్స్ ప్రశంసించారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు సేకరించి ప్రజలకు సలహాలు ఇస్తున్న విధానాన్ని "గ్రేట్" అని కొనియాడారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్ లో సమాచారాన్ని సేకరించి, వేగంగా నిర్ణయాలను తీసుకుంటున్నట్టు బిల్ గేట్స్ కు చంద్రబాబు తెలిపారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని బిల్ గేట్స్ ప్రశ్నించగా... బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో రికార్డులను భద్రపరుస్తున్నామని, భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ వంటి విధానాలతో పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు ఆయనకు వివరించారు. అమరావతి నిర్మాణ వివరాలను కూడా ఆసక్తిగా తెలుసుకున్న బిల్ గేట్స్ "గ్రేట్ వర్క్" అంటూ చంద్రబాబుకు అభినందనలు తెలిపారు.

## శబరిమలలో మహిళలకు ప్రవేశం..
## 9 మందితో సుప్రీంకోర్టు విచారణ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేరళలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై 9 మంది న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఏప్రిల్ 7 నుంచి విచారణ చేపట్టనుంది. మందిరంలోకి 10 నుంచి 50 ఏళ్ల లోపు మహిళలకు శబరిమల శ్రీ ధర్మాశాస్త ఆలయం దశాబ్దాలుగా నిరాకరిస్తోంది. దీనికి 2018లో అత్యున్నత న్యాయస్థానం స్వస్తి చెప్పింది. అన్ని వయస్సుల వారికి ప్రవేశం కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి అప్పగించేందుకు 2020 ఫిబ్రవరి 10న సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ నేపథ్యంలో సంబంధిత పార్టీలు తమ వాదనలను మార్చి 14 లోగా అందజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. 'తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం శబరిమల సమీక్ష కేసుపై ఏప్రిల్ 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి విచారణ జరుపుతుంది. ఏప్రిల్ 22 వరకూ రెండు వారాల పాటు విచారణకు సమయం కేటాయిస్తున్నాం. రివ్యూ పిటిషనర్లు, వారికి సపోర్ట్ చేసే పార్టీ వాదనలను ఏప్రిల్ 7 నుంచి ఏప్రిల్ 9 వరకూ విచారిస్తుంది. రివ్యూను వ్యతిరేకించే వారి పిటిషన్లను ఏప్రిల్ 14 నుంచి ఏప్రిల్ 16 వరకూ వింటాం' అని సుప్రీంకోర్టు తెలిపింది. రిజాయిండర్ సబ్మిషన్లు ఉంటే ఏప్రిల్ 21న వింటామని పేర్కొంది. కాగా, పిటిషన్లపై సమీక్షకు తాము మద్దతిస్తున్నట్టు కేంద్రం సోమవారంనాడు ప్రకటించింది. ఈ అంశంపై కేరళలోని అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) తమ వైఖరిని స్పష్టం చేయాలని కాంగ్రెస్ సారథ్యంలోని యూనైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) డిమాండ్ చేసింది. అయితే కోర్టుకు సమర్పించిన వివరాలను వెల్లడించలేమని సీపీఎం తెలిపింది.

## అగ్ని ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనం



**జైపూర్ :** రాజస్థాన్‌లో రసాయన కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో ఇద్దరు కార్మికులు యూనిట్ లోపల చిక్కుకున్నట్లు అధికారులు సోమవారం తెలిపారు. బివాండి జిల్లాలోని కురుక్షేత్ర-కరోలి పారిశ్రామిక ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఘటన గురించి తెలుసుకున్నారని, వెంటనే సహాయక చర్యలు చేపట్టారని అదనపు జిల్లా మెజిస్ట్రేట్ సుమితా మిశ్రా తెలిపారు. యూనిట్ లోపల తొమ్మిది మంది చిక్కుకున్నారని, ఇప్పటి వరకు ఏడు మృతదేహాలను బయటకు తీశామని అన్నారు. మిగిలిన ఇద్దరు కార్మికులను రక్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

## నేడు మోడీతో మాక్రాన్ భేటి



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ ప్రధాని మోడీతో మంగళవారం భేటీ కానున్నారు. మాక్రాన్ భారత్ పర్యటన సందర్భంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపైనా, ప్రాంతీయ ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై చర్చలు జరపనున్నారు. మోడీ, మాక్రాన్‌లు ముంబయిలో కలవనున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. మధ్యాహ్నం 3.15 నిమిషాల నుంచి 5.15 నిమిషాల దాకా ముంయిలోని లోక్‌భవన్‌లో ఇద్దరు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## ముగిసిన బిల్ గేట్స్‌పర్యటన

ఉన్నాయి, సంపద సృష్టి జరగాల్సి ఉందని అన్నారు. బిల్ గేట్స్ సహకారంతో వివిధ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని వెల్లడించారు. 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నామన్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది ఏపీ ప్రభుత్వ విధానమన్న సీఎం ఇందుకు సాంకేతికతని విస్తృతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. అమరావతి డిజైన్ అండ్ ఫౌండ్రీ, క్వాంటం వ్యాలీగా ఆవిష్కృతం అవుతుందన్నారు. డేటా-ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లును తీర్చిదిద్దుతున్నామన్నారు. ఎలక్ట్రానిక్స్-ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్-స్పేస్ సిటీగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 10 రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నామన్నారు. విద్యారంగంలో అధునిక విధానాలను పాటిస్తున్నాం, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా బోధనలో మార్పులు చేస్తున్నామన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమం కోసం సాంకేతిక సాయం తీసుకుంటున్నామన్నారు. మెరుగైన ప్రజారోగ్య సేవలు అందించేందుకు అత్యున్నత స్థాయి నిపుణులతో సలహా మండలి ఏర్పాటు చేశామని వివరించారు. యూనివర్సల్ హెల్త్? స్క్రీనింగ్? విధానం ప్రజలకు ముందస్తుగానే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనలో సాంకేతిక వినియోగాన్ని టెక్ దిగ్గజం బిల్ గేట్స్ ప్రశంసించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని మెచ్చుకున్నారు. కుప్పంలో అమలు చేసిన సంజీవని ప్రాజెక్టు చాలా చక్కగా ఉందని కొనియాడారు. అమరావతి రాజధాని నిర్మాణంలో 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక గ్రేట్ వర్క్ అని కితాబిచ్చారు. అమరావతిలోని రియల్‌టైం గవర్నెన్స్ కేంద్రం -ఆర్టీజీఎస్‌ను గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్ పరిశీలించారు. సచివాలయానికి వచ్చిన గేట్స్‌కు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్? సాదర స్వాగతం పలికారు. హాలో ఫ్రెండ్! హౌ ఆర్ యూ ? అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును బిల్ గేట్స్ ఆత్మీయంగా పలకరించారు. తాను బాగున్నానని, మీరెలా ఉన్నారంటూ బిల్ గేట్స్‌ను చంద్రబాబు ఆ తర్వాత మంత్రివర్గ సహచరులు, సీఎంఓ అధికారులను పరిచయం చేశారు. అక్కడి నుంచి ఆర్టీజీఎస్ కేంద్రానికి వెళ్లారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానించామని బిల్‌గేట్స్‌కు సీఎం వివరించారు. డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు సులభతరం చేయడం బాగుందని గేట్స్ కితాబిచ్చారు. అవేర్ 2.ా ద్వారా రియల్ టైమ్‌లో సమారాచాన్నిసేకరించి, వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాభిప్రాయం సేకరిస్తూ కీలక సూచీల ద్వారా జీఎస్‌డీపీ వృద్ధిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని బిల్ గేట్స్ ప్రశ్నించగా బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులు భద్రపరుస్తున్నామని, క్యూఆర్ కోడ్‌తో పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. పన్ను వసూళ్ల ప్రక్రియ అద్భుతంగా ఉందన్న గేట్స్ ప్రశంసించగా జీఎస్టీ విధానంతో దేశంలో పన్నుల వసూళ్లు కూడా గణనీయంగా పెరిగిందని సీఎం చెప్పారు. ఇదే సమయంలో ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ వివరాలనూ బిల్ గేట్స్ అడగ్గా చంద్రబాబు వివరించారు. రాజధానిలో 30శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుందని, గ్రేట్ వర్క్ అని బిల్ గేట్స్ మెచ్చుకున్నారు. ఇక గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లాలో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు అమలు గురించి బిల్ గేట్స్ ఆరా తీశారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటీస్ లాంటి పరీక్షల వివరాలు ఎలా నమోదు చేస్తున్నారని అడిగారు. ప్రజల డిజిటల్? హెల్త్? రికార్డుల ఆధారంగా లైఫ్ స్టైల్, ఆహారం తదితర అంశాల్లో సలహాలు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. ఏఐ వినియోగంతో ప్రజారోగ్య సేవలను మరింత మెరుగు పరిచేలా చూస్తున్నామని సీఎం చెప్పారు. "దట్స్ నైస్" అంటూ సంజీవని ప్రాజెక్టు అమలును బిల్ గేట్స్ ప్రశంసించారు. డయాగ్నోస్టిక్ సేవలు తక్కువ వ్యయానికే అందితే పేదలకు వెసులుబాటు ఉంటుందని గేట్స్ అభిప్రాయపడ్డారు. బిల్ గేట్స్ రాకపై సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతిక ఆధారిత పాలనా రంగాల్లో గేట్స్ ఫౌండేషన్‌తో సన్నిహితంగా పని చేయడానికి ఏపీ ఎదురు చూస్తోందని, లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సహచర మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్ తో కలిసి బిల్ గేట్స్ కు విజయవాడ విమానాశ్రయంలో స్వాగతం పలకడం ఆనందంగా ఉందన్నారు.

## కీలక మలుపు: పవన్

ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించబోతోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గేట్స్ ఫౌండేషన్ అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించడం, టెక్నాలజీ ఆధారిత ఆరోగ్య సేవలను అందించడం వంటి అంశాల్లో భాగస్వామ్యం కీలకమని అన్నారు.వ్యవసాయ రంగంలో కూడా గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం రైతులకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత వ్యవసాయం, డ్రోన్ వినియోగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పంటల విశ్లేషణ వంటి విధానాలు రైతుల ఆదాయాన్ని పెంచడంలో సహాయపడతాయని చెప్పుకొచ్చారు. వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చడంలో ఈ భాగస్వామ్యం ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. బిల్‌గేట్స్ అమరావతి పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న టెక్నాలజీ ఆధారిత పాలన, అభివృద్ధి కార్యక్రమాలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర, స్థిర అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం కీలకమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# కల్యాణపులోవ జలాశయంలో భక్తుల పుణ్యస్నానాలు




**రావికమతం, పతాకం న్యూస్:** భక్తజన కోటితో మండలంలోని కల్యాణపులోవ కిక్కిరిసిపోయింది. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం, జలాశయం పరిసరాలు మార్మోగాయి. ఉమ్మడి జిల్లాతోపాటు ఉత్తరాంధ్రలోని పలు ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయంలో శివలింగం రూపంలో వున్న పోతురాజుబాబును, పెద్దింటమ్మవార్లను దర్శించుకోవడానికి బారులు తీరారు. వీరిలో అత్యధికులు తొలుత జలాశయంలో పుణ్యస్నానాలు ఆచరించారు. దీంతో స్నానఘాట్‌లు రద్దీగా మారాయి. పోతురాజుబాబు, పెద్దింటమ్మను దర్శించుకోవడానికి మూడు రోజుల్లో మూడు లక్షల మంది భక్తులు తరలివస్తారన్న అంచనాతో భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. వాహనాల నిలుపుదల కోసం ఆలయ పరిసరాల్లో 45 ఎకరాల మేర చదును చేశారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అసాధారణ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్నానఘాట్‌ల వద్ద గత ఈతగాళ్లను అందుబాటులో వుంచారు. క్యూలో నిల్చున్న తరువాత పోతురాజుబాబు, పెద్దింటమ్మను దర్శించుకోవడానికి రెండు నుంచి నాలుగు గంటల సమయం పట్టిందని భక్తులు చెబుతున్నారు. అనకాపల్లి డీఎస్పీ శ్రావణి పర్యవేక్షణలో కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు చేపట్టారు.

# పరిమితికి మించి విద్యార్థులతో వెళుతున్న స్కూల్ ఆటోలు



**ఎలమంచిలి, పతాకం న్యూస్:** మండలంలోని చాలా మంది ఆటో డ్రైవర్లు నిబంధనలను పాటించడం లేదు. పరిమితికి మించి విద్యార్థులను పాఠశాలలకు తరలిస్తున్నారు. విద్యార్థులు ఒంటి చేత్తో ఆటోలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో అధిక శాతం ఆటోల్లో డ్రైవర్‌కు రెండు వైపులా విద్యార్థులు కూర్చోవడంతో పాటు వెనుక వైపు వేలాడుతూ వెళుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. వాస్తవానికి ఆటోలో ఎనిమిది మంది విద్యార్థులనే తీసుకు వెళ్లాలి. కానీ ప్రస్తుతం 15 మంది వరకు విద్యార్థులను డ్రైవర్లు తీసుకు వెళుతున్నారు. ఎలమంచిలి పట్టణంలో 16కు పైగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. స్థానిక విద్యార్థులతో పాటు సమీపంలోని రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల్లోని పలు గ్రామాల విద్యార్థులు ఈ పాఠశాలల్లో చదువుతున్నారు. వీరిలో ఎక్కువ మంది ఆటోల్లోనే వస్తుంటారు. అయితే కొందరు ఆటో డ్రైవర్లు పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుని ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని ఆటోల్లో పిల్లలు వేలాడుతూ వెళుతున్నారు. ఏ మాత్రం ఆదమరుపుగా ఉన్నా పెనుప్రమాదం తప్పదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆటో డ్రైవర్లకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఫలితం లేకుండాపోతోంది. పెనుప్రమాదాలు జరగక ముందే పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# పాల అమ్మకం ధరలను పెంచిన విశాఖ డెయిరీ




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పాల అమ్మకం ధరలను పెంచుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. కేవలం తొమ్మిది నెలల వ్యవధిలో లీటరుకు రెండు రూపాయల మేర పెంచడంతో వినియోగదారులపై రోజుకు రూ.10 లక్షల మేర అదనపు భారం పడనుంది. పెరిగిన పాల ధరల పట్టికలను ఇప్పటికే అమ్మకందారులకు డెయిరీ యాజమాన్యం పంపింది. ఈ ధరలు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొన్నది. సవరించిన ధరల ప్రకారం హోమోజినైజ్డ్ డబుల్ టోన్డుపాలు 500 అర లీటరు రూ.26 నుంచి రూ.27కు, హోమోజినైజ్డ్ టోన్డు పాలు రూ.28 నుంచి రూ.29కి, టోన్డు పాలు రూ.28 నుంచి రూ.29కి, స్టాండర్డైజ్డ్ పాలు 500 రూ.31 నుంచి రూ.32కి, ఫుల్‌క్రీమ్ పాలు లీటరు రూ.66 నుంచి రూ.68కి, హోమోజనైజ్డ్ టోన్డు పాలు (గంగ) రూ.28 నుంచి రూ.29కి, డబుల్ టోన్డు పాలు (గంగ) రూ.26 నుంచి రూ.27కు పెంచారు. పెరుగు, ఇతర ఉపఉత్పత్తులపై ధరలు ప్రస్తుతం పెంచలేదు. కాగా గత ఏడాది మే 10న లీటరు పాలపై రెండు రూపాయల మేర పెంచిన విశాఖ డెయిరీ యాజమాన్యం.. తొమ్మిది నెలల వ్యవధిలోనే రూ.2 చొప్పున పెంచింది. విశాఖ డెయిరీ రోజుకు సుమారు ఐదు లక్షల లీటర్ల పాలను విక్రయిస్తున్న. పెంచిన ధరల ప్రకారం వినియోగదారులపై సుమారు రూ.10 లక్షల అదపు భారం పడనుంది.

# 28, 1 తేదీల్లో టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోటీలు: గంటా



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మధురవాడ ఏసీఏ – వీడీసీఏ స్టేడియంలో ఈనెల 28, మార్చి 1వ తేదీల్లో టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. హోటల్ మేఘాలయలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తో కలిసి క్రికెట్ పోటీల వివరాలను ఆయన వెల్లడించారు. టాలీవుడ్ నటులు, టీవీ నటులతో రెండేసి టీంలు.. పోలీసులు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులతో ఒక్కో టీం చొప్పున మొత్తం 7 టీంల నుంచి 110 సెలబ్రిటీలు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ మ్యాచ్ ల ద్వారా వచ్చే ఆదాయాన్ని పేద పిల్లల చదువు, సీఎం సహాయ నిధి, దాతృత్వ కార్యక్రమాలకు వినియోగిస్తారని పేర్కొన్నారు. విశాఖను అంతర్జాతీయ స్పోర్ట్స్ హబ్ గా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందన్నారు. కొమ్మాదిలో అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, దివ్యాంగుల ప్రత్యేక స్టేడియం అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత బీసీసీఐ సహకారంతో మధురవాడ క్రికెట్ స్టేడియంలో వసతులు ఎంతగానో మెరుగుపరిచారని వన్డే, టీ20, ఐపీఎల్ మ్యాచ్ ల కేటాయింపులో విశాఖకు ప్రాధాన్యమిస్తున్నారన్నారు. రెండు రోజుల పాటు అలరించనున్న సెలబ్రిటీ లీగ్ ను వీక్షించే అవకాశాన్ని విశాఖ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. భోగాపురం ఎయిర్ పోర్టు కార్యకలాపాలు మొదలైన తర్వాత విశాఖ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, 7 మాస్టర్ ప్లాన్ కనెక్టింగ్ రోడ్లు ఈ ఏడాది జూన్ లోపు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామన్నారు. సెలబ్రిటీ లీగ్ నిర్వాహకుడు రాంబాబు మాట్లాడుతూ క్రికెట్ పోటీల నిర్వహణలో వెన్నంటి ఉండి నడిపిస్తున్న ఎమ్మెల్యే గంటా సూచనతో ఉచిత ప్రవేశం కల్పించాలని నిర్ణయించామని తెలియజేశారు. ఐపీఎల్ తరహాలో సెలబ్రిటీ మ్యాచ్ లను డిజైన్ చేశామన్నారు. టాలీవుడ్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్ పోస్టర్ ను ఈ సందర్భంగా విడుదల చేశారు. వ్యాపారవేత్తలు కంకటాల మల్లిక్, పైడా కృష్ణప్రసాద్, కాశీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

102.48 ఎకరాలు కేటాయింపు, రూ.2,300 కోట్ల పెట్టుబడి

# అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు కానున్న 'బ్లూ జెట్ హెల్త్‌కేర్' కంపెనీ



**పరవాడ, పతాకం న్యూస్:** అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలో మరో ఫార్మా కంపెనీ ఏర్పాటు కానున్నది. 'బ్లూ జెట్ హెల్త్‌కేర్ లిమిటెడ్' ఆధ్వర్యంలో సుమారు రూ.2,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఫార్మా కంపెనీకి ఈ నెల 28వ తేదీన శంకుస్థాపన జరగనున్నట్టు తెలిసింది. ఏపీఐఐసీ అధికార వర్గాల సమాచారం మేరకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అచ్యుతాపురం సెజ్‌లోని రాంబిల్లి మండల పరిధి ఏపీఐఐసీ ఫేజ్–2లో 102.48 ఎకరాలను ఈ ఫార్మా కంపెనీకి కేటాయించారు. ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం పది గంటలకు శంకుస్థాపన వుంటుందని ఏపీఐఐసీ అచ్యుతాపురం సెజ్ డిప్యూటీ జోనల్ మేనేజర్ కూండ్రపు సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తోపాటు పలువురు మంత్రులు హాజరవుతారని వెల్లడించారు. బ్లూ జెట్ హెల్త్ కేర్ ఫార్మా పరిశ్రమలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదువేల మందికి ఉపాధి లభించనుందని కంపెనీ వర్గాలు చెబుతున్నాయి.

# టమాటా ధర పతనం.. రైతుల్లో ఆందోళన



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌కు రైతులు భారీ మొత్తంలో టమాటాలు తీసుకువచ్చారు. దీంతో ధర ఒక్కసారిగా పడిపోయింది. ఇక్కడ మార్కెట్‌కు రైతులు అధిక మొత్తంలో కూరగాయలు తీసుకువస్తుంటారు. ఇదే విధంగా పాడేరు, అనకాపల్లి, కొత్తవలస, కె.కోటపాడు, విశాఖపట్నం నుంచి వ్యాపారులు సైతం ఎక్కువ మంది వచ్చి, రెట్టింపు పరిమాణంలో కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. రైతులు యథా విధిగా ఈ ఆదివారం కూడా పలు రకాల కూరగాయలను అమ్మకానికి తీసుకొచ్చారు. అయితే మహాశివరాత్రి పండుగ కావడంతో కొనుగోలు చేసే వ్యాపారులు అంతగా రాలేదు. దీంతో పరిస్థితిని అంచనా వేసిన వ్యాపారులు.. కూరగాయల రేట్లను తగ్గించేశారు. ముఖ్యంగా టమాటాల ధరలు భారీగా పతనం అయ్యాయి. గత వారం సుమారు 25 కిలోలు వుంటే క్రేట్ టమాటాలు రూ.500 పలకగా, ఈ ఆదివారం రూ.250కి పడిపోయాయి. పది గంటల తరువాత కొనుగోలుదారులు తగ్గిపోవడంతో క్రేట్ టమాటాలు రూ.200లకే ఇచ్చేయాల్సి వచ్చింది. ఇక చిక్కుడు కాయలు క్రేట్ (12 కిలోల) 220కి పడిపోయింది. గత వారం రూ.660కి వ్యాపారులు కొనుగోలు చేశారు. బీర కాయలు క్రేటు (25 కిలోలు) రూ.600 పలికింది. గత వారం రూ.900 పలికిందని రైతులు చెబుతున్నారు. ఇంకా పలు రకాల ఆకు కూరల ధరలు సైతం తగ్గాయి. ఒకేసారి పలు రకాల కూరగాయలు కోతకు రావడం, మరోవైపు మహాశివరాత్రి పండుగ సందర్భంగా వ్యాపారులు అరకొరగా రావడం ధరలు తగ్గడానికి కారణమని రైతులు అభిప్రాయపడుతున్నారు.

# డంపింగ్‌యార్డు తొలగించే వరకు పోరాడుదాం



**గాజువాక, పతాకం న్యూస్:** రామచంద్రనగర్ డంపింగ్ యార్డును తొలగించే వరకు పోరాటం చేద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. జివిఎంసి 76వ వార్డు పరిధిలోని డంపింగ్‌యార్డు ఎదుట చేపట్టిన వంటావార్పు నిరసన కార్యక్రమం ఆదివారం 7వ రోజుకు చేరింది. ఈ నిరసన కార్యక్రమాన్ని జగ్గునాయుడు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ డంపింగ్‌యార్డును తరలించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గకుండా అత్యంత పట్టుదలగా పోరాటం చేయాలని కోరారు. ఈ డంపింగ్‌యార్డును తరలించాలని కోరితే ఇంకో చోట ఏర్పాటుకు స్థలం లేదని అధికారులు చెప్పడం సిగ్గుచేటన్నారు. పారిశ్రామికవేత్తలకు 99 పైసలకే వందల ఎకరాలు కట్టబెడుతుంటే, డంపింగ్‌యార్డు కోసం ఐదెకరాలు లేదని చెప్పటం తీవ్ర అన్యాయం అన్నారు. తమతో వస్తే స్థలం ఎక్కడుందో చూపెడతామన్నారు. డంపింగ్‌యార్డు పోరాట కమిటీ నాయకులకు హెచ్చరికలు చేస్తూ ఎసిపి మాట్లాడుతున్నారని తెలిసిందని, దీనికి భయపడేది లేదని చెప్పారు. ప్రజలు తలచుకుంటే ప్రధానమంత్రి మిత్రుడు అదాని సిమెంట్ ఫ్యాక్టరీనే పెట్టకుండా అడ్డుకున్న చరిత్ర ఇటీవలే జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ పోరాటంలో 16 కాలనీలకు చెందిన 30 వేల మంది ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. న్యాయమైన ఈ సమస్య పరిష్కారానికి సిపిఎం విశాఖ జిల్లా కమిటీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. అందరూ కలిసి పోరాటం చేసి సమస్యను పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. గంగవరం పోర్టు కాలుష్యం వల్ల కళ్లముందే పసిబిడ్డలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పోర్టు దుమ్ము ధూళితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. టిడిపి నాయకులు బాలకృష్ణ మాట్లాడుతూ, తాము అధికార పార్టీకి చెందినప్పటికీ ఈ పోరాటంలో భాగస్వామ్యం అవుతామని తెలిపారు. ఈ పోరాటానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. డంపింగ్‌యార్డు పోరాట కమిటీ అడ్వైజర్ కమిటీ నాయకులు ఎం.రాంబాబు, మంత్రి శంకరనారాయణ, మమ్మన మురళి మాట్లాడుతూ, ఈ సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటం సాగుతుంద

# 'గంగవరం' వాహనాలను దారి మళ్లించాలని నిరసన

**గాజువాక, పతాకం న్యూస్:** అదాని గంగవరం పోర్టు వాహనాలను తమ రోడ్డు మీదగా నడపరాదని కోరుతూ వైజంక్షన్ వద్ద పాత కర్ణవానిపాలెం గ్రామస్తులు నిరసన చేపట్టారు. గ్రామస్తులందరూ రోడ్డుపైన కూర్చొని నిరసన తెలిపారు. వేరే రోడ్డు ద్వారా భారీ వాహనాలు తరలించాలని కోరారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఒంటిగంట సమయంలో గాజువాక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి వచ్చి సర్దిచెప్పినా గ్రామస్తులు వినలేదు. నిరసన కొనసాగించారు. వీరి పోరాటానికి సిపిఎం సీనియర్ నాయకులు ఎన్.రామారావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అదాని గంగవరం పోర్టుతో విపరీతమైన దుమ్ము ధూళి పెరుగుతుందన్నారు. దీనివల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. గాజువాకలో నివాసం ఉండలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తంచేశారు. దానికి తోడు భారీ వాహనాలు ఈ రోడ్డుపై వెళ్లడం వల్ల వచ్చే ధూళితోనూ ఇబ్బందులు తప్పడంలేదని తెలిపారు. మున్సిపల్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఫోన్ ద్వారా తెలియజేయడంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు.

# వడ్లపూడిలో అన్ని బస్సులూ ఆపాలి



**వడ్లపూడి, పతాకం న్యూస్:** జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడి హైవేలో ఉన్న రిక్వెస్ట్ బస్ స్టాప్‌ను పర్మనెంట్ బస్టాప్‌గా చేసి, అన్ని బస్సులనూ ఆపాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాథం (జగన్) కోరారు. ఈ మేరకు కూర్మన్నపాలెం బస్ డిపో మేనేజర్ కెకె.రావుకు వినతి పత్రం అందజేశారు. 87వ వార్డు ప్రాంతంలో సుమారు 30 వేల మంది జనాభా నివసిస్తున్నారని, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు ప్రతిరోజు ఆర్‌టిసి బస్సులపై ప్రయాణిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంగా వడ్లపూడిలో ఉన్న భవిత స్కూల్‌లు మానసిక అంగవైకల్య విద్యార్థులను తీసుకొని తల్లిదండ్రులు దూర ప్రాంతాల నుండి వస్తున్నారని, బస్సులు ఆపకపోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని బస్సులు ఆగేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి వార్డు అధ్యక్షులు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్ రాజు, కణితి ఈశ్వరరావు, గండేపల్లి రాము, కోరుకొండ కల్యాణ్ చక్రవర్తి, అప్పలనాయుడు, బోండా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను దక్షిణ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ తన కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఈ సహకారం బాసటగా ఉంటుందన్నారు. కష్టకాలంలో సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిన సహాయం తమకు ఎంతో ఉపయోగపడిందని రోగులు, వారి బంధువులు చెప్పారు. సిఎం రిలీఫ్ ఫండ్ అందించడంలో సహకరించిన సీతంరాజు సుధాకర్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అర్తాం కొండల్లో ఏనుగులు



**విజయనగరం, పతాకం న్యూస్:** కొమరాడ మండలంలో కొద్దిరోజులుగా సంచరిస్తున్న ఏనుగులు అర్తాం కొండల్లో దర్శనమిచ్చాయి. దీంతో స్థానికులు బెంబేలెత్తి పోతున్నారు. పగలంతా కొండల్లో ఉంటున్న గజరాజులు రాత్రి వేళల్లో పొలాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికే మండలంలో మొక్కజొన్న, అరటి పంటలను అవి నాశనం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఏనుగుల కారణంగా గత రెండేళ్లుగా పంటలను నష్టపోతున్నా.. పరిహారం చెల్లించడం లేదని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేసుంటే ఏనుగుల రూపంలో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. అటవీశాఖాధికారులు స్పందించి.. తక్షణమే ఈ ప్రాంతం నుంచి గజరాజులను తరలించే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




**గుమ్మలక్ష్మీపురం, పతాకం న్యూస్:** చట్టాలపై అధికారులు అవగాహన పెంపొందించుకోవాలని పార్వతీపురానికి చెందిన రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో రెవెన్యూ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిం చారు. పార్వతీపురం, కురుపాం మండల న్యాయ సేవా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అప్ హోల్ట్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన బాల్య వివాహ్ విముక్తి రథాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖకు చెందిన 21 చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతీ శనివారం జిల్లా లోని అన్ని మండలాల్లో ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తామ న్నారు. కార్యక్రమంలో తహ సీల్దార్ ఎన్.శేఖరం, ఎంపీడీవో శ్రీనివాసరావు, న్యాయవాదులు పి.మోహన్‌మురళి, గొర్లి వెంకటరావు, ఎ.లక్ష్మీపతిరాజు, వి.శ్రీనివాసరావు, సీఐ బి.హరి, ఎస్ఐ శివప్రసాద్, లోక్ అదాలత్ సభ్యుడు గొటారి వెంకటరావు, అంధవరపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## రణభేరిని జయప్రదం చేయాలి



**సీతంపేట, పతాకం న్యూస్:**పీఆర్సీతోపాటు ఇతర ఆర్థిక డిమాం డ్లపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టబోయే రణభేరి 2.0 కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారావు పిలుపు నిచ్చారు. సీతంపేట సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 12వ పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియ మించాలని కోరారు. 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, హెల్త్‌కార్డు, మెడికల్ బిల్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చే శారు. సీపీఎస్ రద్దుచేసి మెమో-57ప్రకారం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారంకోసం ఈనెల 17న విజయవాడలో నిర్వహించనున్న చలోరణభేరికి ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి కె.ఆనందరావు, బి.పకీరు, ఎ.ప్రకాశం, సింహాద్రి, పి.చ్రందకళ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు: కలిశెట్టి



**రణస్థలం, పతాకం న్యూస్:** ప్రజా సమ స్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని విజయ నగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. సంచాం గ్రామంలో ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరిం చారు. అనంతరం అక్కడి నుంచే సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు లంక శ్యామలరావు, పిసిని జగన్నాథం నాయుడు, కొమరాపు రవి పాల్గొన్నారు.

# టెక్కలిలో 50 పడకల ఆయుష్ ఆసుపత్రికి ఉత్తర్వులు





**టెక్కలి, పతాకం న్యూస్:** టెక్కలిలో 50 పడకల సామర్థ్యంతో సమగ్ర ఆయుష్ ఆసుపత్రి ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రూ.15 కోట్లు వ్యయంతో ఈ కీలక ప్రాజెక్టును నిర్మించేందుకు ఆయుష్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ కె దినేష్ కుమార్, ఐఏఎస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ .... ఈ హాస్పిటల్ కార్యరూపం దాల్చడం కోసం పూర్తిగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి చేశారని అన్నారు. జాతీయ ఆయుష్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి గరిష్ట నిధులు రాబట్టడంలో మంత్రి అచ్చెన్నాయుడు కీలక పాత్ర పోషించారు అని తెలిపారు. గ్రామీణ, దూర ప్రాంత ప్రజలకు ఆయుష్ వైద్య సేవలు మరింత చేరువ కావాలనే సంకల్పంతో టెక్కలిని ఆయుష్ వైద్య కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ ఆసుపత్రి ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆయుష్ శాఖ అధికారులు అవసరమైన పరిపాలనా చర్యలను పూర్తి చేసి ఉత్తర్వులు ఇచ్చారు. ఐ పిహెచ్ ఎస్,ఎన్ ఎఏఎం, మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఆధునిక సౌకర్యాలతో ఆసుపత్రి నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ఆసుపత్రి ప్రారంభమైతే శ్రీకాకుళం జిల్లా ప్రజలకు ఆయుర్వేదం, యోగ, నేచురోపతి, తదితర ఆయుష్ వైద్య సేవలు ఒకే వేదికపై అందుబాటులోకి రానున్నాయని అన్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం దిశగా టెక్కలి నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందన్నారు.

## పంచాయతీల్లో పేరుకుపోతున్న ఆశీలు బకాయిలు



**గజపతినగరం, పతాకం న్యూస్:** గజపతినగరం, పురిటిపెంట పంచాయ తీల్లో ఆశీలు బకాయిలు పేరుకుపోతున్నాయి. పంచాయతీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వసూళ్లు కావడంలేదన్న విమర్శలొస్తున్నాయి. పాలకులు, అధికారులు మారినా బకాయిలపై దృష్టి సారించడంలేదు. ఏటా పాట నిర్వహిస్తున్నా పాత బకాయిలు చెల్లించాలని పాటదారులపై ఒత్తిడి తీసుకురావడంలేదు. గజపతినగరం, పురిటిపెంట పంచాయతీలకు మండలంలోని పలుగ్రామాల్లో పండించిన కూరగాయల పంటలను ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. దీంతో ప్రస్తుతం గజపతినగరం పంచాయతీకి సంబంధించి ప్రతి రోజూ మూడు నుంచి నాలుగువేల వరకు ఆదాయం వస్తుంది. పురిటిపెంట పంచాయితీకి నాలుగువేల నుంచి ఐదు వేల వరకు ఆశీలరూపంలో ఆదాయంవస్తుంది. ఈ రెండు పంచాయతీల్లో ఏటా మార్చిలో జరిగే ఆశీలు వేలం పాటకు సంబందించి పంచాయతీ పాలకులు, అధికారులు, పాటదారులు సిండికేట్‌కావడంతో పాటను తగ్గిస్తువస్తున్నారన్న ఆరోపణలు విని పిస్తున్నాయి. కరోనా సమయంలో నాలుగులక్షలకు వెళ్లిన ఆశీలపాట గత ఏడాది రెండు లక్షలకు తగ్గిపోయింది. పాటదారులు బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించడం లేదు. లక్షల్లో ఆశీలు పాటపాడిన పాటదారులు వేల రూపాయల్లో పంచాయతీలకు చెల్లించి చేతులు దులుపుకొంటున్నారు. ఏటా పాటదారులు మారుతుండడంతో అధికారులు పేరుకుపోయిన బకాయిలను రికార్డులకే పరిమితం చేస్తున్నారు. వారికి నోటీసులిచ్చి బకాయిలు రాబట్టే ప్రయత్నాలు మాత్రం చేయడంలేదు. ఇప్పటివరకు గజపతినగరం పంచాయతీకి ఐదు లక్షలకు పైబడి, పురిటిపెంట పంచాయతీకి సంబందించి 13 లక్షలకు పైబడి బకాయిలు పేరుకుపోయాయి. గజపతినగరం పంచాయతీలో చంపావతి వంతెన నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న షాపుల నుంచి, కూరగాయలు, చేపల మార్కెట్, వాహనాల లోడింగ్,అన్‌లోడింగ్ ఇసుక బళ్లు, ట్రాక్టర్లు తదితర వాటిపై ఆశీలు వసూళ్లు చేస్తున్నారు. అయితే ఆశీలువసూళ్లు చేసిన వారికి ఎటువంటి రశీదు ఇవ్వడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. ఏటా పంచాయతీపాట తగ్గినా వసూళ్లు మాత్రం ఏడాదికేడాది పెంచుకుంటు పోతున్నారని, నిర్ణీత ధర ప్రకటించకుండా ఇష్టారాజ్యంగా వసూళ్లు పాల్పడుతున్నారని వ్యాపారులు, కూరగాయ రైతులు వాపోతున్నారు. వ్యాపారాలను బట్టి, వాహనాల లోడింగ్ అన్ లోడింగ్‌కు సంబందించి ధరల పట్టికను పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటుచేయాలి. కాని ఆ విదంగా చేయడంలేదని ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు తీసుకువస్తే తట్టకు రూ.10 వసూళ్లు చేయడం శోచనీయమని రైతులు వాపోతున్నారు. పాటదారులు సిండికేట్ కావడంతో పంచాయతీ ఆదాయానికి గండిపడుతోందని పలువురు చెబుతునాన్నరు.

## పిల్లల్లో నులిపురుగులను నివారించి వారి ఆరోగ్యాన్ని సంరక్షిద్దాం



**అరసవల్లి, పతాకం న్యూస్:** పిల్లల్లో నులిపురుగులను నివారించి వారి ఆరోగ్యాన్ని సంరక్షిద్దామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.అనిత పిలుపునిచ్చారు. ఈ నెల 17న డీవార్మింగ్ డే పురస్కరించుకుని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 1-19 సంవత్సరాల లోపు వయసు గల వారందరికీ తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 4.27లక్షల మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. రక్తహీనత లేని, ఆరోగ్యకర సమాజ స్థాపనకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో డీవార్మింగ్ డే నిర్వహిస్తామని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పాదరక్షలు ధరించడం, పరిశుభ్రమైన తాగునీరు, ఆహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలతో నులిపురుగుల బారిన పడకుండా ఉండవచ్చని అన్నారు. కార్యక్రమంలో డీఐవో డా.రాందాస్, డాక్టర్ శివరంజని, డాక్టర్ బి.రవీంద్ర, డి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాజాంలో చెరకులోడ్‌తో లారీ బోల్తా



**రాజాం, పతాకం న్యూస్:** పాలకొండ- రాజాం రూట్‌లో సంకిలి చెక్కర కర్మాగారానికి నిత్యం ఓవర్‌లోడ్‌తో చెరకును తరలి స్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఈ ఒక్క కర్మాగారమే నడుస్తోంది. ప్రస్తుతం చెరకు సీజన్ కావడంతో కటింగ్‌చేసిన 24 గంటల్లో కర్మాగారానికి తరలించకపోతే రికవరి తగ్గిపోయే ప్రమాదముంది. దీనికితోడు కటింగ్ ఆర్డర్ కూడా సకాలంలో దొరకడంలేదు. దీంతో త్వరగా నరికిన చెరుకును కర్మాగారా నికి తరలించాలన్న ఆలోచనతో ఓవర్‌లోడ్ చేస్తున్నారు. దీంతో ట్రాక్టర్లు, లారీలో రోడ్డుపై బోల్తాపడుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగు తోంది. విజయనగరం జిల్లాలోని రేగిడి, వంగర, సంతకవిటి తదితర మండలాలతోపాటు శ్రీకాకుళం జిల్లాలో నుంచి పలు మండలాల నుంచి చెరకు కర్మాగారానికి తరలిస్తున్నారు. ఇటీవల చిన్నశిర్లాం సెంటర్‌లో ఓవర్‌లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ బోల్తాపడడంతో పాలకొండ- విశాఖ రోడ్డు రెండు గంటలు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనాలను మళ్లించారు. ప్రధాన రహదారుల గుండా ఓవర్‌లోడ్‌తో చెరకు లారీలు తరలిస్తున్నా పోలీసులు, రవాణాశాఖ అధికారులు చోద్యంచూస్తుండడంపై సర్వత్రా విమర్శలొ స్తున్నాయి.

## తారు వేసి రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో వాహనచోదకులు, ప్రయాణికులు అగచాట్లు



**విజయనగరం, పతాకం న్యూస్:** గుర్ల మండలంలోని శేషపుపేట నుంచి వల్లా పురం మెయిన్ రోడ్డు వరకూ మెటల్ వేసినా తారువేసి రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో వాహనచోదకులు, ప్రయాణికులు అగచాట్లకు గురవుతు న్నారు. రోడ్డుపై మెటల్ వేసి మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకు తారు వేసే పనులు పూర్తిచేయకపోవడంతో రాళ్లు తేలడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఇక్కడ ప్రజల ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం తారురోడ్డునిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. రోడ్డు పనులు చేపట్టి మెటల్ పనులు పూర్తిచేశారు. అయితే తారురోడ్డు మాత్రం వేయలేదు. దీంతో గ్రామస్థులతోపాటు ప్రయాణికులు అగచాట్లకు గురవుతున్నారు. నిత్యం ఈ రోడ్డు వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. మెటల్ వేసి విడిచిపెట్టడం వల్ల చీకటిపడిన తర్వాత ఈ మా ర్గంలో వచ్చిపోయే వాహనాలు పల్టీలు కొడుతుండడంతో గాయపడుతు న్నామని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు ఏర్పాటు చేయాలని, తారు రోడ్డు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

## నిరాశాజనకంగా మిరియాల సాగు

**పాడేరు, పతాకం న్యూస్:** మన్యంలో రైతులకు ఆదాయాన్ని సమకూర్చే వాణిజ్య పంటల్లో ఒకటైన మిరియాలు ఈసారి నిరాశను మిగిల్చింది. వాతావరణ మార్పుల ప్రభావం వల్ల పంట దిగుబడి తగ్గనుందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన్యంలో 2.72 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు ఉన్నాయి. వీటిలో నీడ కోసం పెంచుతున్న సిల్వర్ ఓక్ చెట్లకు మిరియాల పాదులను గిరిజన రైతులు చాలా ఏళ్ల నుంచి పెడుతున్నారు. సుమారు 70 వేల ఎకరాల్లో మిరియాలు సాగవుతున్నాయి. ఒక్కో సిల్వర్ ఓక్ చెట్టుకు అల్లుకున్న పాదు ద్వారా ఏడాదికి 25 నుంచి 30 కిలోల పచ్చి మిరియాలు దిగుబడి వస్తుంది. దీంతో, కాఫీ రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. ఈ పంట సీజన్ ఏటా జనవరిలో మొదలై ఏప్రిల్ వరకూ కొనసాగుతుంది. మిరియాలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ ఏడాది పంటను అననుకూల వర్షాలు, ఆకస్మిక వాతావరణ మార్పులు నష్టపరిచాయి. ముఖ్యంగా పుష్ప దశలో ఉండాల్సిన వాతావరణం అనుకూలించక పువ్వులు రాలిపోయాయి. దీంతో, ఈ ఏడాది ఒక్కో పాదుకు పది నుంచి 15 కిలోల పచ్చి మిరియాలు మాత్రమే వచ్చే అవకాశం ఉందని గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరియాల పంట రైతులు ఈ నెలాఖరు నుంచి కోతలు ప్రారంభిస్తారు. కోసిన వాటిని ఎండబెట్టి, శుద్ధి చేసి మార్చి నుంచి వారపు సంతల్లో విక్రయిస్తారు. సుమారుగా నెలన్నర రోజులు ఏజెన్సీ వారపు సంతల్లో, గ్రామాల్లో మిరియాల క్రయవిక్రయాలు జరుగుతుంటాయి.

# ప్రపంచ యుద్ధ నౌకల ప్రదర్శనకు రంగం సిద్ధం

## 18న ఫ్లీట్ రివ్యూ, 19న మిలన్, ఇంటర్నేషనల్ సిటీ పరేడ్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ సాగర తీరం ప్రపంచ యుద్ధ నౌకాదళ ఉత్సవానికి సిద్ధమైంది. ఇందుకోసం భారత నౌకాదళం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నేపథ్యంలో వివిధ దేశాల నౌకల రాక సైతం మొదలైంది. అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ, మిలన్ 2026, నేవీ చీఫ్‌ల కాన్ క్లేవ్‌కి విశాఖ నగరం వేదికైన తరుణంలో ఏర్పాట్లపై గత 3 నెలలుగా జిల్లా యంత్రాంగం పెద్ద కసరత్తే చేసింది. ఫిబ్రవరి 18న అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఫ్లీట్ రివ్యూ-2026), 19న ఇంటర్నేషనల్ సిటీ పరేడ్, మిలన్, 20న 'ఐయాన్స్ కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్' కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మన దేశంలో ఉన్న యుద్ధనౌకల శక్తి సామర్థ్యాలను ఒకచోట సమీక్షించడాన్నే ఫ్లీట్ రివ్యూ అంటారు. ప్రతి ఏటా రాష్ట్రపతి ఆధ్వర్యంలో త్రివిధ దళాలకు ఈ సమీక్ష నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అనంతర కాలంలో సముద్ర రక్షణ రంగ సామర్థ్యాలు ప్రదర్శించడానికి, ఇతర దేశాల నౌకా దళాలతోనూ సంబంధాలు బలపర్చుకునేందుకు ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు ఎదిగింది. ప్రపంచ దేశాల నుంచి వచ్చిన నావికా సిబ్బందితో బీచ్ రోడ్డులో ప్రత్యేక పరేడ్?ను నిర్వహిస్తారు. భాగస్వామ్య దేశాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశాఖ చేరుకుంటారు. 18న ఫ్లీట్ రివ్యూలో పాల్గొననున్నారు. 2016లో 51 దేశాలు ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి. 10 ఏళ్ల తర్వాత మళ్లీ విశాఖ వేదికైంది. ఈసారి జరుగుతున్న ఫ్లీట్ రివ్యూలో 70 దేశాలు పాల్గొననున్నాయి. మిత్రదేశాల నౌకా దళాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను, సమన్వయాన్ని బలోపేతం చేయడమే 'మిలన్' లక్ష్యం. ఈ కార్యక్రమానికి 137 దేశాలను ఆహ్వానించాయి. సమాచారం మేరకు 70 దేశాలు వరకు పాల్గొంటున్నట్లు అధికార వర్గాల తెలియజేశాయి. మిలన్ విన్యాసాలు 2 దశల్లో నిర్వహిస్తారు. తొలుత 19న హార్బర్ ఫేజ్‌లో అనగా తీరంలో, 21 నుంచి సీ ఫేజ్‌లో అనగా సముద్రంలో విన్యాసాలు నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశారు. ఈనెల 19న సాయంత్రం ఆర్కే బీచ్ రోడ్డులో 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్' నిర్వహిస్తారు. వివిధ దేశాల నౌకా దళాల కవాతు ఆకట్టుకునేలా ఉంటుంది. ప్రపంచ దేశాల సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తాయి. ఈ కవాతు బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు నిర్వహిస్తారు. భారత నౌకాదళ ఫైటర్ జెట్స్, పారాచూట్లు, హెలికాప్టర్లతో ఆకాశంలో అద్భుత విన్యాసాలు ప్రదర్శించనున్నారు. ఆ తర్వాత నౌకాదళ లేజర్ షోలు, బ్యాండ్ ప్రధాన ఆకర్షణగా ఉంటాయి. ఈనెల 20న 'ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం కాన్ క్లేవ్ ఆఫ్ చీఫ్స్' నిర్వహించనున్నారు. ఫ్లీట్ రివ్యూ, మిలాన్‌ల కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు సిద్ధం చేసింది. 7,000 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. 64 డ్రోన్లతో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు జీవీఎంసీ ఆధ్వర్యంలో 119 అభివృద్ధి, సుందరీకరణ పనులను రూ.19 కోట్లతో చేపట్టి పూర్తి చేశారు. ఆర్కే బీచ్‌లో ప్రధాన ప్రాంగణం ఏర్పాట్లు



పూర్తి అయ్యాయి. ప్రముఖులు, వీఐపీలు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వీక్షకులు విన్యాసాలు చూసేందుకు గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ఐఎఫ్ఆర్‌కు ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ ఆహ్వానించారు. ఈ ఫ్లీట్ రివ్యూలో ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ విక్రాంత్, ఐఎన్ఎస్ నీలగిరి, ఢిల్లీ, విశాఖ, రాజ్?పుత్, శివాలిక్, ఆర్నాలా, బ్రహ్మపుత్ర, తల్వార్ తరగతికి చెందిన స్వదేశీ పరిజ్ఞానంతో చేసిన యుద్ధ నౌకలు, అణు జలాంతర్గాములతో పాటు వివిధ దేశాలకు చెందిన దాదాపు 23 యుద్ధనౌకలు పాల్గొననున్నాయి. అందుకు తగ్గట్లు సన్నద్ధత ఏర్పాట్లు పూర్తి చేశారు.

## వనరులు, వసతులు పుష్కలంగా ఉన్న పారిశ్రామికాభివృద్ధి జాడ ఏది?



**నరసాపురం, పతాకం న్యూస్:** నరసాపురం తీర ప్రాంతంలో 1977లో ఓఎన్‌జీసీ చేపట్టిన తవ్వకాల్లో అపార గ్యాస్, అయిల్ నిక్షేపాలు బయటపడ్డాయి. ఈప్రాంతంలో ఉత్ప త్తి అవుతున్న గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారే తప్ప ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు. అయిల్ శుద్ధి కర్మాగారాన్ని కూడా గ్యాస్ ఆధారిత పవర్ ప్లాం ట్‌ను విజ్జేశ్వరం వద్ద ఏర్పాటుచేసి నరసాపురానికి చిన్నచూపు చూశారు. సుమారు 19కిలోమీటర్ల మేర కోస్టల్ తీరం విస్తరిం చినా ఒక పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు. ఏటా రూ.150 కోట్లుపైనే ఆక్వా ఉత్పత్తులు నరసాపురం నుంచే దేశ విదేశాల కు ఎగుమతి చేస్తున్నారు. ఇక లేస్ పరిశ్రమ, కొబ్బరి ఉత్పత్తు లు పుష్కలం. మొగల్తూరు, నరసాపురం మండలంలో పరిశ్ర మల ఏర్పాట్లుకు వేల ఎకరాల భూమి అందుబాటులో ఉంది. గతంలో ఈ ప్రాంతంలో అనేక పరిశ్రమల ఏర్పాటుకు నేతలు హామీలు ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. 25ఏళ్ల క్రితం అప్పటి కేంద్రమంత్రి యూవీ.కృష్ణంరాజు పేరుపాలెం ప్రాంతం లో అయిల్ శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటిం చారు. సర్వే కూడా చేపటినా ప్రాజెక్టు ముందుకు సాగలేదు. తరువాత ఇదే ప్రాంతానికి చెందిన దాసరి నారాయణరావు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు నరసాపురంలో పర్యటించి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇండోనే షియా నుంచి బొగ్గు దిగుమతి చేసుకుని జిందాల్ సంస్థ పవర్ ప్లాంట్ నిర్మిస్తుందని ప్రకటించారు.

అయితే ఇది కూడా ముం దుకు సాగలేదు. ఇక 2006లో గ్రీన్‌ఫీల్డ్ సంస్థ థర్మల్ కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చింది. సర్వే కూడా చేపట్టినప్పటికీ కూడా వెనక్కి వెళ్లింది. అప్పట్లో 216 జాతీయ రహదారి, రైల్వే డబ్లింగ్ లైన్ లేవు. ప్రస్తుతం తీరం వెంబడి జాతీయ రహదారితో పాటు విజయవాడ-- నరసాపురం మధ్య డబ్లింగ్ లైన్ కూడా ఏర్పడింది. రాష్ట్ర విభజన తరువాత నరసాపురంలో పోర్టు నిర్మిస్తున్నట్లు అప్పటి సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీలో ప్రకటించారు. నరసాపురం మండలం వేములదీవి, బియ్యపుతిప్ప, మొగల్తూ రు మండలం కేపీపాలెం, పేరుపాలెం, మొళ్లపర్రు వద్ద సర్వే కూడా చేసి 300 ఏకరాలను గుర్తించారు. అప్పట్లో కొంతమంది దీనిని వ్యతిరేకించిన నేపథ్యంలో ఇది పెండింగ్ పడింది.

ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పీఎం లంకలో పర్యటించారు. నరసాపురం జిల్లా కేంద్రం, మెడికల్ కాలేజీలు తరలిపోవడంతో ఈప్రాంతం ఆర్థికంగా వెనుకబాటుకు గురైందని స్థానిక నేతలు ఆమెకు వివరించారు. పోర్టు నిర్మాణం తెరపైకి తెచ్చి ప్రస్తుతం పెండింగ్‌లో పెట్టారని విన్నవించారు. దీనితో నిర్మలమ్మ నరసాపురం అభివృద్ధిపై చొరవ చూపుతున్నారు. పర్యటన అనంతరం కేంద్ర మంత్రి అమరావతిలో సీఎం చంద్రబాబుతో సమావేశమయ్యారు. వనరులున్నా అభివృద్ధి లేదని, కనీసం పోర్టునైనా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. దీనిపై చంద్రబాబు కేబినేట్ సమావేశంలో ప్రస్తావించారు. పోర్టుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి నిమ్మలకు బాధ్యత అప్పగించారు.

## విబి గ్రామ్ జితో రాష్ట్రంపై అదనపు భారం రూ.2,500 కోట్లు



**అమరావతి, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబి గ్రామ్ జి పథకం అమలుతో రాష్ట్రంపై ఈ ఏడాది రూ.2,510 కోట్ల మేర అదనపు భారం పడింది. ప్రస్తుత బడ్జెట్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.8,365 కోట్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించాయి. ఈ మొత్తంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటా రూ.5,019 కోట్లు రాష్ట్రానికి కేటాయిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.3,346 కోట్లు కేటాయిస్తుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలులో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో కేటాయింపులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు. కేవలం 10 శాతం మేర రూ.836 కోట్లు కేటాయిస్తే, మిగిలిన మొత్తం కేంద్ర ప్రభుత్వం నుంచి అందేవి. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్రం నోటిఫై చేసిన ప్రాంతాల్లోనే పనులు చేసేందుకు అవకాశం ఉండటంతో ఈ నిధులు ఎంత మేర ఖర్చు చేస్తారనే అంశంపై అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. దీనికి తోడు పనుల ఎంపిక విషయంలోనూ స్థానిక సంస్థల స్వేచ్ఛ లేకపోవడంతో ఈ పథకంలోని వేతనదారులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి ఏర్పడింది. గడిచిన మూడేళ్లలో ఏటా వేతనదారులు 23 నుంచి 25 కోట్ల పని దినాలను రాష్ట్రంలో పూర్తి చేశారు. ఇందుకు రూ.8,500 కోట్ల నుంచి రూ.9 వేల కోట్ల వరకూ నిధులను వెచ్చిస్తున్నారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు అరకొరగా ఉన్న, విబి గ్రామ్ జి పథకంలో మారిన నిబంధనల కారణంగా వేతనదారులకు ఏ మేరకు ఉపాధి లభిస్తుందనే అంశంపై ఆందోళన చెందుతున్నారు.


## మార్చి 9న స్పీకర్ తొలగింపు తీర్మానంపై చర్చ, ఓటింగ్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాపై ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చ, తదుపరి ఓటింగ్ మార్చి 9న జరుగుతుందని, విరామం తర్వాత సభ తిరిగి సమావేశమవుతుందని కేంద్రపార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆదివారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం.. బడ్జెట్ సెషన్ రెండవ దశ మార్చి 9 నుండి ఏప్రిల్ 2 వరకు కొనసాగుతుందని అన్నారు. పలు ముఖ్యమైన చట్టాలు, క్లిష్టమైన బిల్లులపై పార్లమెంటులో చర్చ, ఆమోదం కోసం సమర్పించనున్నట్లు తెలిపారు. మార్చి 9న లోక్‌సభ తిరిగి ప్రారంభమైన తర్వాత అవిశ్వాస తీర్మానంపై చర్చ ఉంటుందని, పార్లమెంట్ నిబంధనల ప్రకారం తీర్మానంపై మొదటి రోజే చర్చ చేపట్టాలని అన్నారు. చర్చతోపాటు ఓటింగ్ నిర్వహిస్తామని అన్నారు. ప్రతిపక్షం సభ పనిచేసేందుకు అనుమతించకపోతే గిలెటిన్‌ను ప్రవేశపెడతామని, దాంతో వారికే నష్టమని అన్నారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ సమయంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని మాట్లాడేందుకు అనుమతించకపోవడంతో స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

### భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం పేరుతో

## రైతులకు ద్రోహం: రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత్-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం పేరుతో భారతీయ రైతులకు చేస్తున్న ద్రోహాన్ని చూస్తున్నామని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. వాణిజ్య ఒప్పందం పేరుతో మోడీ ప్రభుత్వం అమ్ముడుపోయిందని మండిపడ్డారు. ఈ ఒప్పందంపై ఆదివారం రాహుల్‌గాంధీ ప్రధాని మోడీకి పలు ప్రశ్నలు సంధించారు. " ఈ అంశం భవిష్యత్తుకు సంబంధించినది. మరో దేశం మన దేశ వ్యవసాయ రంగంపై దీర్ఘకాలికంగా పట్టు సాధించడానికి భారతదేశం అనుమతిస్తుందా" అని ప్రధాని మోడీని నిలదీశారు. భారత్ డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్ (డిడిజి)లను దిగుమతి చేసుకుంటుందని,అంటే దానర్థం భారతీయ పశువులకు అమెరికా జన్యుమార్పిడి మొక్కజన్నతో తయారు చేసిన డిడిజిని దాణాగా వేస్తారా, ఇది మనదేశ పాల ఉత్పత్తులను అమెరికా వ్యవసాయ పరిశ్రమపై ఆధారపడేలా చేయదా అని ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వం జన్యుమార్పిడి సోయా నూనెను దిగుమతికి అనుమతించిందని, ఇది మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌లతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న సోయా రైతులపై ప్రభావం చూపదా అని ప్రశ్నించారు. మరోసారి ధరల షాక్‌ను రైతులు ఎలా తట్టుకోగలరని కేంద్రాన్ని నిలదీశారు. ఒప్పందంలో మీరు 'అదనపు ఉత్పత్తులు' అని కూడా ప్రకటించారని, వాటిలో ఏమి ఉంటాయని ప్రశ్నించారు. భవిష్యత్తులో పప్పుధాన్యాలు, ఇతర పంటల్లో అమెరికా దిగుమతులను అనుమతించాలనే ఒత్తిడిని ఇది సూచిస్తుందా అని నిలదీశారు. వాణిజ్యేతర అడ్డంకులను తొలగించడమంటే భవిష్యత్తులో భారతదేశం జన్యుమార్పిడి పంటలపై తన వైఖరిని సడలించడానికి, సేకరణను బలహీనపరచడానికి లేదా కనీస మద్దతుధర, బోనస్‌లను తగ్గించేలా ఒత్తిడి చేస్తుందా అని ప్రశ్నించారు. ఒకసారి దిగుమతులకు ద్వారాలు తెరిస్తే, ప్రతి ఏడాది దానిని విస్తృతంగా అనుమతించకుండా నిరోధించడం కష్టతరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని నిరోధించవచ్చా, లేదా ప్రతిసారీ క్రమంగా మరిన్ని పంటలను దిగుమతికి అనుమతిస్తారా, రైతులకు ఈ స్పష్టతనివ్వాలని అన్నారు. ఈ అంశం కేవలం ప్రస్తుత సమస్య కాదని, భవిష్యత్తుకు సంబంధించిన అంశమని అన్నారు.

# మన్యం రోడ్లకు మోక్షమెప్పుడు..?



**కేఆర్ పురం, పతాకం న్యూస్:** కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని అటవీ ప్రాంతాల్లోని మన్యం రోడ్లకు మోక్షమెప్పుడని అధికారులను గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. మారుమూల అటవీ ప్రాంతాల్లోని కొండరెడ్డి చాలా గ్రామాలకు నేటికీ సరైన రహదారులు లేక అవస్థలు పడుతున్నా పాలకుల చెవికి చేరడం లేదు. తారురోడ్ల మాట దేవుడెరుగు కనీసం గ్రావెల్ రోడ్లయినా వేయమంటూ కొండరెడ్లు వేడుకుంటున్నారు. ఏనాడో రోడ్లపైన వేసిన గ్రావెల్ కొట్టుకుపోయి నేడు పెద్దపెద్ద రాళ్లు దర్శనమిస్తున్నాయని, కనీసం కాలినడకన వెళ్లడానికి కూడా అవకాశం లేకుండా పాడైపోయాయని అడవి బిడ్డలు గగ్గోలు పెడుతున్నారు. పీఆర్ గూడెం, ముంజులూరు, గెడ్డపల్లి పంచాయతీలోని కన్నారప్పాడు, ఉగ్రింక, గోగుమిల్లి, చింతపల్లి, గెడ్డపల్లి, గుమ్ములూరు, చిలకలూరు తదితర గ్రామాల రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. రహదారులను బాగు చేయాలని ఐటీడీఏ అధికారులను వేడుకుని ఎన్నో సార్లు వినతులు అందించినా స్పందన లేదు. గత ప్రభు త్వంలో రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరైనా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం లోనైనా రోడ్లను పూర్తి చేయాలని న్యూడెమోక్రసీ నాయకులు పి.శ్రీనివాస్, కె.లత, జి.నిర్మల, జి.ప్రసాద్‌రెడ్డి కొండరెడ్లు కోరుతున్నారు.

## బోర్లకు మరమ్మతులు చేయించండి

**అనంతపురం, పతాకం న్యూస్:** బొమ్మనహాళ్ మండలంలోని శింగానహళ్లి, దేవగిరి గ్రామాల్లో పలు చేతిపంపులు పని చేయడం లేదు. వేసవిలో విద్యుత, తాగునీటి సమస్యలు వచ్చినప్పుడు ... ఆ గ్రామస్థులకు ఈ బోర్ల నీరే ఆధారం. రానున్న వేసవిలో తాగునీటి సమస్య వస్తే.. ఎలా అని ఆ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా.. వారి పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఇక వేసవితో తాగునీటి సమస్య వస్తే.. కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయబోర్ల వద్దకు వెళ్లాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఈ చేతిబోర్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



## ఈనెల 20 నుంచి సీపీఐ దీక్షలు



**పాలకొల్లు, పతాకం న్యూస్:** రాగులపాడు నుంచి పిల్లకాలువల ద్వారా గుంతకల్లు, ఉరవకొండ మండలాలకు కృష్ణ జలాలు తరలించేందుకే నిధులు కేటాయించాలని ఈనెల 20 నుంచి దీక్షలు చేపడుతున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీ జగదీష్, రైతు సంఘం నాయకులు తెలిపారు. స్థానిక బీరప్ప స్వామి కళ్యాణ మండపంలో రైతు సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2017 ఏప్రిల్ 20న పామిడిలో బహిరంగ సభలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు గుంతకల్లు మండలంలోని చెరువులన్నింటికీ హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణజలాలు మళ్లించేందుకు కాలువలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన భూసేకరణ, కాలువ నిర్మాణాలకు నిధులు కేటాయించలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వీటి కోసం నిధులు కేటాయించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రతి రోజు ఒక గ్రామానికి చెందిన రైతులు దీక్ష చేస్తారన్నారు. కార్యక్రమంలో దోనిముక్కల సర్పంచు శ్రీరాములు, టీడీపీ రైతు సంఘం నాయకులు పాలమల్లికార్జున, జడ్పీటీసీ కదిరప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రాము, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## శ్మశానవాటికలో మంత్రి నిమ్మల శ్రమదానం



**పాలకొల్లు, పతాకం న్యూస్:** ఆగర్తిపాలెం శ్మశానవాటికలో మంత్రి నిమ్మల రామానాయుడు గ్రామస్తులతో కలిసి శ్రమదానం చేశారు. శ్మశానవాటికలో వ్యర్థాలు, చెత్తచెదారం, పిచ్చిమొక్కలు, అంత్యక్రియలకు ఉపయోగించి పడవేసిన కుండలు తొలగించి శుభ్రం చేశారు. ఆయనతో పాటు గ్రామస్థులు కూడా శ్మశానవాటికను శుభ్రంచేసి ఆహ్లాదకరం గా తీర్చిదిద్దారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ పవిత్రమైన మహా శివరాత్రి రోజున శ్మశానవాటికను శుభ్రం చేయటం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఐజేయూ ప్రధాన కార్యదర్శి దూసనపూడి సోమసుందరం, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, పి.రజనీకుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని 6గ్రామాల శ్మశానవాటికల్లో రూ.1.25 కోట్లతో అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఇటీవల పూలపల్లిలో గాంధీ మెగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన స్మశాన వాటిక అభివృద్ధి పనులు పరిశీలించారు. రామానాయుడు మాట్లాడుతూ శ్మశానవాటికలు శివుడు నివసించే పవిత్ర స్థలాలన్నారు. పాలకొల్లు పట్టణంలోని హిందూ శ్మశాన వాటికను కైలాస వనంగా తీర్చిదిద్దామన్నారు. మిగిలిన అన్ని శ్మశాన వాటికలను దశల వారీగా ఇదే రకంగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు.

## మాజీ గిరిజన ఎంపీ రత్నాభాయి మృతి



**రంపచోడవరం, పతాకం న్యూస్:** మాజీ రాజ్యసభ సభ్యురాలు, కాంగ్రెస్‌పార్టీ గిరిజన మహిళా నేత తటపట్ల రత్నాభాయి(79) ఆదివారం అర్ధరాత్రి రంపచోడవరంలో మృతి చెందారు. గత కొంతకాలంగా స్వల్ప అనారోగ్యం తోనే ఉన్నా ఆమె అందరికీ అందుబాటులోనే ఉంటూ వచ్చారు. కాగా ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయాక తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ఆమెను హుటాహుటిన రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అత్యవసర వైద్య సేవలు అందించారు. కానీ పరిస్థితి చేయిదాటిపోయింది. ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ 1972లో రాజకీయారంగేట్రం చేసి కాంగ్రెస్ పార్టీ తరపున ఎల్లవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో అనేక కీలక పదవులు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రత్యేక గుర్తింపుతో 2005 నుంచి 2007 వరకూ గిరిజన సహకార సంస్థ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

# పోషకాలకు చెందిన సప్లిమెంట్లను తీసుకుంటున్నారా? అయితే జాగ్రత్త!

పోషకాలకు చెందిన సప్లిమెంట్లను తీసుకుంటున్నారా..? అయితే జాగ్రత్త..! మారిన మన ఆహారపు అలవాట్ల కారణంగా మనలో చాలా మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. దీంతో చాలా మంది శరీరానికి కావల్సిన పోషకాల కోసం సప్లిమెంట్స్ పై ఎక్కువగా ఆధారపడుతున్నారు. నిద్రపోవడానికి, జుట్టు, చర్మ ఆరోగ్యానికి, ఎముకల ఆరోగ్యానికి, మానసిక స్థితి మెరుగుపడడానికి ఇలా ప్రతి దానికి సప్లిమెంట్స్ మనకు మార్కెట్‌లో లభిస్తున్నాయి. మారిన మన ఆహారపు అలవాట్ల కారణంగా మనలో చాలా మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. దీంతో చాలా మంది శరీరానికి కావల్సిన పోషకాల కోసం సప్లిమెంట్స్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నారు. నిద్రపోవడానికి, జుట్టు, చర్మ ఆరోగ్యానికి, ఎముకల ఆరోగ్యానికి, మానసిక స్థితి మెరుగుపడడానికి ఇలా ప్రతి దానికి సప్లిమెంట్స్ మనకు మార్కెట్ లో లభిస్తున్నాయి. వీటిని చాలా మంది ఉపయోగిస్తున్నారు కూడా. ఇక సప్లిమెంట్స్ ను వైద్యుల సూచనలు లేకుండా కూడా చాలా మంది ఇష్టం వచ్చినట్టు ఉపయోగిస్తున్నారు. అయితే ఈ సప్లిమెంట్స్ ను ఎలా, ఎప్పుడు వాడుతున్నారు అనే అంశాలపై వాటిని మన శరీరం గ్రహించే విధానం, వాటి వల్ల మనకు కలిగే ఉపయోగాలు ఆధారపడి ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. వాటిని వాడే విధానం తెలియకపోవడం వల్ల వాటిని ఉపయోగించినప్పటికీ ఫలితం ఉండదని వారు చెబుతున్నారు. కనుక ఐరన్ నుండి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్ల వరకు వివిధ రకాల సప్లిమెంట్స్ ను ఏవిధంగా తీసుకోవాలో.. ఇప్పుడు తెలుసుకుందాం. ఐరన్ సప్లిమెంట్స్‌ను చాలా మంది ఉపయోగిస్తూ ఉంటారు. వీటిని రోజూ



వాడుతూ ఉంటారు. ఇలా రోజూ వాడడం అంత మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. వీటిని రెండు రోజులకు ఒకసారి వేసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందని వారు తెలియజేస్తున్నారు. ఐరన్ సప్లిమెంట్స్ ను అతిగా తీసుకోవడం వల్ల మలబద్దకం, కడుపు నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఒమెగా 3 సప్లిమెంట్స్ ను కూడా చాలా మంది ఉపయోగిస్తున్నారు. కానీ ఇవి చేపల వాసన వస్తాయని చాలా మంది చెబుతూ ఉంటారు. ఈ వాసన తొలగిపోవాలంటే ఈ సప్లిమెంట్స్ ను ఫ్రిజ్ లో నిల్వ చేయాలని వారు సూచిస్తున్నారు. అలాగే ఇవి వేడికి త్వరగా ఆక్సీకరణం చెందుతాయి కనుక వీటిని ఫ్రిజ్ లో నిల్వ చేయడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

ఫైబర్ సప్లిమెంట్స్ ను కూడా చాలా మంది ఉపయోగిస్తారు. అయితే వీటిని వాడే వారు తగినంత నీటిని తాగడం చాలా ముఖ్యం. నీటిని ఎక్కువగా తాగకుండా ఫైబర్ సప్లిమెంట్స్ ను వాడడం వల్ల కడుపు ఉబ్బరం వచ్చే అవకాశం ఉంటుంది. కనుక 10 గ్రాముల ఫైబర్ కు 9 ఔన్సుల నీరు తాగాలని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక విటమిన్ డి సప్లిమెంట్స్ తీసుకునే వారు దీనిని విటమిన్ కె2 తో కలిపి తీసుకోవాలి. విటమిన్ డి తీసుకుంటే క్యాల్షియంను మీ ఎముకల్లోకి, ధమనుల్లోకి పంపడానికి విటమిన్ కె2 తో కలిపి తీసుకోవాలి. అలాగే ప్రోబయోటిక్స్ తీసుకునే వారు వెంటనే యాంటీ బయాటిక్ మందులను వాడకూడదు. ప్రోబయోటిక్స్ తీసుకున్న 2 లేదా 3 గంటల తరువాత మాత్రమే యాంటీ బయాటిక్ మందులను వాడాలి. అదే విధంగా జిమ్ కి వెళ్లే వారు క్రియాటిన్ సప్లిమెంట్స్ ను ఎక్కువగా తీసుకుంటారు. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరం సమస్య వచ్చే అవకాశం ఉంది. కనుక వీటిని తక్కువ మోతాదులో రోజుకు రెండు సార్లు తీసుకునే ప్రయత్నం చేయాలి.

రోగనిరోధక శక్తిని పెంచడంలో జింక్ ముఖ్య పాత్ర పోషిస్తుంది. కానీ వీటిని ఇతర సప్లిమెంట్స్ తో కలిపి తీసుకోవడం వల్ల శరీరం జింక్ ను ఎక్కువగా శోషించదు. జింక్ సప్లిమెంట్స్ ను తీసుకునే వారు వీటిని క్యాల్షియం, ఐరన్ సప్లిమెంట్స్ తో కలిపి తీసుకోకపోవడం మంచిది. ఈ మధ్య కాలంలో చాలా మంది మెగ్నీషియం సప్లిమెంట్స్ ను కూడా తీసుకుంటున్నారు. నిద్ర నాణ్యతను పెంచడంలో మెగ్నీషియం పాత్ర ఎంతో ఉంది. అయితే మీరు ఎటువంటి మెగ్నీషియం సప్లిమెంట్స్ ను తీసుకుంటున్నారు అనేది ముఖ్యం. నిద్ర కోసం ఈ సప్లిమెంట్స్ ను తీసుకునే వారు మెగ్నీషియం గ్లైసినేట్ ను తీసుకోవడం మంచిదని వైద్యులు చెబుతున్నారు.

ఈ విధంగా సప్లిమెంట్స్ ను తీసుకునే విషయంలో అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, వీటిని తీసుకునే సరైన విధానం తెలియకపోతే మనం అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు సలహా ఇస్తున్నారు. అయితే సప్లిమెంట్స్ ఏవైనా సరే వైద్య సలహా మేరకు మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. సొంత వైద్యం పనికిరాదు. లేదంటే అనేక అనారోగ్య సమస్యలు లేదా దుష్ప్రభావాల బారిన పడాల్సి వస్తుంది.

## చైనా సరిహద్దు ప్రాంతంలో కిరణ్ రిజిజు పర్యటన



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఆర్మీ మాజీ చీఫ్ నరవణే పుస్తకం వివాదం వేళ, కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చైనా సరిహద్దుల్లో పర్యటించారు. ప్రచురితం కాని నరవణే పుస్తకాన్ని ప్రదర్శిస్తూ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇలాంటి తరుణంలో చైనా సరిహద్దుకు దగ్గరలోని తన నియోజకవర్గం అరుణాచల్ వెస్ట్‌లో కేంద్రమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ, పార్లమెంటు సజావుగా సాగడంపై రాహుల్ గాంధీకి ఆసక్తి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని కొన్ని ఎన్జీవోలు ఆయనకు చెప్పాయని, అందుకే పదేపదే సభను అడ్డుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేశ భద్రత విషయంలో రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు. ప్రచురితం కాని పుస్తకం గురించి చెప్పడానికి ఏముంటుందని కిరణ్ రిజిజు అన్నారు. ఆ పుస్తకం గురించి మనం మాట్లాడుకోకూడదని అన్నారు. అయితే రాహుల్ గాంధీ మాట్లాడింది జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి తీవ్రంగా పరిగణించాలని అన్నారు. అలాంటి అంశాలను రాజకీయాల కోసం ఉపయోగించుకోవద్దని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీకి సరిహద్దుల గురించి ఏమీ తెలియదని, అందుకే అలాంటి ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. సరిహద్దుల గురించి ఆయన తెలుసుకుంటే మంచిదని సూచించారు.

## తెలంగాణలో 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ల ఎన్నిక వాయిదా




**హైదరాబాద్, పతాకం న్యూస్:** పలు కారణాల వల్ల 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నిక వాయిదా పడింది. ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీలో ఎన్నిక వాయిదా పడినట్లు అధికారులు వెల్లడించారు. తిరిగి ఎప్పుడు ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారన్న విషయమై స్పష్టత రావల్సి ఉంది.

# భారంగా మారుతున్న ఇసుక డిపోల నిర్వహణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రభుత్వ అనుమతితో నగరంలో మూడు చోట్ల ఏర్పాటు చేసిన ఇసుకడిపోల నిర్వహణ భారంగా మారుతోందని నిర్వాహకులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో వాటి మనుగడపై సందిగ్ధత నెలకొంది. నగరంలో నిర్మాణాలకు అవసరమైన ఇసుక తక్కువ ధరకు అందించాలన్న ఉద్దేశంతో నెలకొల్పిన డిపోల్లో అమ్మకాలు వెలవెలబోతున్నాయి. నిర్వహణ భారంగా మారడంతో ఏంచేయాలో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వినియోగదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రీచ్‌లలో నామమాత్రంగా (జీఎస్టీ చార్జీలు తీసుకుని) పంపిణీ ప్రారంభించింది. గత ప్రభుత్వంలో నగరంలో టన్ను ఇసుక రూ.1,500 నుంచి రూ. 1,800 ధర పలికేది. ఆ ధరలు బాగా తగ్గించి ఇసుక సామాన్యులకు అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు సరఫరాకు వీలుగా గాజువాక, ముడసర్లోవ, భీమిలిలో ప్రైవేటు వ్యక్తులకు డిపోల ఏర్పాటు బాధ్యత అప్పగించింది. నగరానికి ఆనుకుని పెద్ద నదులు లేకపోవడంతో ఇక్కడ నిర్మాణదారుల అవసరాలకు అనుగుణంగా ఈ డిపోలు ఏర్పాటుచేశారు. ఇందుకోసం స్థలాలను లీజుకు తీసుకున్నారు. గోదావరి నుంచి గాజువాక డిపో, నాగావళి, వంశధార నుంచి ముడసర్లోవ, భీమిలి డిపోలకు ఇసుక సరఫరా జరుగుతోంది. గాజువాకలో టన్ను రూ.1,000, ముడసర్లోవలో రూ.730, భీమిలిలో రూ.700గా ధర నిర్ణయించారు.

డిపోల నుంచి సంబంధిత నిర్మాణదారుల ఇంటికి చేరేసరికి గాజువాక ప్రాంతంలోటన్ను రూ.1300, నగరంలో రూ.1000 ఖర్చవుతోంది. అయితే రీచ్‌ల వద్ద ఇసుక రవాణాకు ఆంక్షలు లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు నగరానికి తీసుకువచ్చి నేరుగా సరఫరా చేస్తున్నారు. డిపోల్లో కన్నా వీరి వద్ద తక్కువ ధరకు ఇసుక లభిస్తుండడంతో నిర్మాణదారులు డిపోల జోలికి వెళ్లడంలేదు. అయితే గోదావరి ఇసుక వినియోగించే వారు మాత్రం గాజువాక డిపో నుంచి కొనుగోలుచేస్తున్నారు. ముడసర్లోవ, భీమిలిలో అంతంత మాత్రంగానే ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మూడు డిపోలు కొనసాగించడంపై అధికారులు సమాచాలోచనలు చేస్తున్నారు. లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన డిపోలతో ఇప్పటికే నష్టాలు చవిచూశారు. టన్ను, అరటన్ను ఇసుక నగరంలో ఎక్కడపడితే అక్కడ లభిస్తుండడంతో డిపోల్లో రేట్లు తగ్గించాలని అధికారులు భావిస్తున్నారు. గాజువాకలో టన్ను రూ.600, మిగిలిన రెండు డిపోల్లో రూ.500గా నిర్ణయిస్తే వ్యాపారం పుంజుకునే అవకాశం ఉందని అంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని నదుల నుంచి ఇసుక తవ్వకాలకు అనుమతిలేదు. కేవలం సొంత అవసరాలకు మాత్రం ఎడ్లబళ్లు/ ట్రాక్టర్లపై ఇసుక తవ్వకాలు చేసుకోవచ్చు. ఈ ముసుగులో అక్రమ తవ్వకాలు భారీగా జరుగుతున్నాయి. దీంతో కొందరు వ్యాపారులు ఉమ్మడి జిల్లాల నుంచి ఇసుక తీసుకువస్తున్నారని గనుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో డిపోల నిర్వహణపై ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు.




## పాకిస్తాన్‌పై ఘన విజయంతో
# సూపర్-8కు చేరిన టీమిండియా



టీ20 ప్రపంచకప్‌లో భాగంగా పాకిస్తాన్‌పై భారత్ ఘన విజయం సాధించింది. గ్రూప్-ఏలో కొలంబోలో జరిగిన మ్యాచ్‌లో అన్ని విభాగాల్లో సమిష్టిగా రాణించిన టీమిండియా 61 పరుగుల భారీ తేడాతో గెలుపు సొంతం చేసుకుంది. ఈ విజయంతో ప్రపంచకప్‌లో సూపర్‌ఎయిట్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఇషాన్ కిషన్ (77, 40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ అర్ధ సెంచరీతో చెలరేగటంతో తొలుత భారత్ 175/7 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ (32, 29 బంతుల్లో 3 ఫోర్లు), శివం దూబె (27, 17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), తిలక్ వర్మ (25, 24 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఛేదనలో పాకిస్తాన్ 18 ఓవర్లలోనే చేతులెత్తేసింది. భారత బౌలర్లు సమిష్టిగా విజృంభించారు. హార్దిక్, బుమ్రా, వరుణ్, అక్షర్ రెండేసి వికెట్లు పడగొట్టగా పాకిస్తాన్ 114 పరుగులకే కుప్పకూలింది. పాక్ తరఫున ఉస్మాన్ ఖాన్ (44, 34 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), షహీన్ షా అఫ్రిది (23 నాటౌట్, 19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. పరుగుల పరంగా భారత్‌కు పాకిస్తాన్‌పై ఇదే భారీ విజయం. వర్డల్‌కప్‌లో పాకిస్తాన్‌పై భారత్ విజయాలు 8-1గా నిలిచింది. ఇప్పటి వరకూ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించిన భారత్ 6 పాయింట్లతో పట్టికలో ఆగ్రస్థానంలో ఉంది. గ్రూప్ దశలో ఆఖరు మ్యాచ్‌లో బుధవారం నెదర్లాండ్స్‌తో భారత్ తలపడుతుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్‌లో అభిషేక్ శర్మ (0) పాక్ కెప్టెన్ సల్మాన్ ఉచ్చులో పడ్డాడు.కానీ, మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ (77) దుమ్మురేపాడు. షహీన్ షా అఫ్రిదికి సిక్సర్‌తో స్వాగతం పలికిన ఇషాన్ కిషన్.. పవర్‌ప్లేలో రెచ్చిపోయాడు. 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 27 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. తిలక్ వర్మ (25)తో కలిసి రెండో వికెట్‌కు 46 బంతుల్లో 87 పరుగులు జోడించాడు. 10 ఫోర్లు, 3 సిక్సర్లతో పాక్ బౌలర్లను ఒత్తిడిలో పడేసిన ఇషాన్ సెంచరీ దిశగా సాగాడు. ఆయుబ్ ఓవర్లో కిషన్ వికెట్ కోల్పోయాడు. కిషన్ అవుటయ్యే సరికి భారత్ స్కోరు 88/2 కాగా.. అందులో కిషన్ ఒక్కడే 77 పరుగులు చేశాడు. తరువాత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32), తిలక్‌లు 38 పరుగుల భాగస్వామ్యంతో మెరిసి భారీ స్కోరుకు పునాది వేశారు. కానీ స్పిన్నర్ ఆయుబ్ ఇన్నింగ్స్ 15వ ఓవర్లో వరుస బంతుల్లో తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య (0)ను సాగనంపి గట్టి దెబ్బకొట్టాడు. సూర్య తనదైన దూకుడు చూపించకపోయినా.. తొలుత తిలక్‌తో, ఆ తర్వాత దూబెతో కీలక భాగస్వామ్యాలు నిర్మించాడు. శివం దూబె (27), రింకు సింగ్ (11 నాటౌట్) ఆఖరు ఓవర్లో 16 పరుగులు పిండుకుని భారత్‌కు 175 పరుగుల స్కోరు అందించారు. పాక్ బౌలర్లలో ఆయుబ్ (3/25) మూడు వికెట్లతో మాయ చేయగా.. సల్మాన్ (1/10), ఉస్మాన్ (1/24), షహీన్ షా అఫ్రిది (1/31) తలా ఓ వికెట్ పడగొట్టారు.

## తిలక్ వర్మపై గంభీర్ అసహనం!



టీ20 వరల్డ్‌కప్ -2026లో భాగంగా పాకిస్తాన్‌తో జరుగుతున్న కీలక మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మన్ తిలక్ వర్మ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. తొలి ఓవర్లోనే అభిషేక్ శర్మ ఔటవ్వడంతో క్రీజులోకి వచ్చిన తిలక్.. ఆ తర్వాత నెమ్మదిగా ఆడుతూ అభిమానులను నిరాశపరిచాడు. ఒకవైపు ఇషాన్ కిషన్ దూకుడుగా బ్యాటింగ్ చేస్తుండగా.. తిలక్ మాత్రం జిడ్డు ఆటతో పరుగులు తీసేందుకు తడబడ్డాడు. ఈ క్రమంలో తిలక్ ఆటతీరుపై హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

డ్రింక్స్ బ్రేక్ సమయంలో డగౌట్ నుంచి బయటకు వచ్చిన గంభీర్.. తిలక్ వర్మతో చాలా సీరియస్‌గా మాట్లాడినట్లు తెలుస్తోంది. వేగంగా ఆడాలని, స్కోరు 170 దాటేలా టార్గెట్ పెట్టాలని గంభీర్ గట్టిగా సూచించినట్లు వార్తలు వస్తున్నాయి. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మ్యాచ్‌లో పాకిస్థాన్ స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తిలక్ కొంత ఇబ్బంది పడ్డాడు. చివరికి 24 బంతుల్లో 25 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. తిలక్ స్ట్రైకరేట్ 104.17గా నమోదైంది.




# 'కపుల్ ఫ్రెండ్లీ" విజయం బాధ్యత పెంచింది : సంతోష్ శోభన్



సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా రీసెంట్ గా థియేట్రికల్ రిలీజ్ కు వచ్చి సూపర్ హిట్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. యూత్, ఫ్యామిలీ ఆడియెన్స్ ఆదరణతో ఈ సినిమా ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా డే 1 వరల్డ్ వైడ్ 1.89 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు దక్కించుకుంది. "కపుల్ ఫ్రెండ్లీ" చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మించింది. అజరు కుమార్ రాజు.పి ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. "కపుల్ ఫ్రెండ్లీ" సినిమాను ప్యాషనేట్ ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని ఏపీ, తెలంగాణలో రిలీజ్ చేశారు. ఈ రోజు ఈ సినిమా సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ -- "కపుల్ ఫ్రెండ్లీ" సినిమా రిలీజ్ ముందు ఇది ప్రేక్షకులకు గుర్తుండిపోయే ప్రేమ కథ అవుతుందని చెప్పాను. నా మాటను నిజం చేస్తూ ప్రేక్షకులు మంచి విజయాన్ని అందించారు. ఈ సినిమా సక్సెస్ క్రెడిట్ మొదటగా దర్శకుడు అశ్విన్ కే ఇవ్వాలి. హానెస్ట్ గా సినిమాను రూపొందించాడు. యూవీ వంశీ, విక్కీ ఎంతో ప్యాషనేట్ గా ఈ సినిమాను నిర్మించారు. ఓ పెద్ద సినిమాకు తీసుకున్న శ్రద్ధ ఈ సినిమాకూ తీసుకుని దగ్గరుండి అన్ని వర్క్స్ చూసుకున్నారు. సంతోష్ శోభన్ టాలెంటెడ్ యాక్టర్. ప్రేమ కథా చిత్రాలకు ఆయన చిరునామా కావాలి. నాతో మాట్లాడిన దర్శక నిర్మాతలు సంతోష్ తో లవ్ స్టోరీ చేస్తే బాగుంటుందని అంటున్నారు. సంతోష్, వారణాసి, యూవీ సంస్థ నేనూ కలిసి మరో ప్రేమ కథను చేయబోతున్నాం. ఆ సినిమా వచ్చే ఏడాది వాలెంటైన్స్ డేకు రిలీజ్ చేస్తాం. ఈ లవ్ ను ప్రేక్షకులకూ పంచేందుకు ఓ కాంటెస్ట్ రన్ చేస్తాం. మీకు మీ పార్టనర్ కు ఇవ్వాలనుకుని ఇవ్వలేకపోయిన గిఫ్ట్ ను మేము అందించాలని అనుకుంటున్నాం. సంతోష్, మానసతో ప్రమోషనల్ టూర్ ప్లాన్ చేస్తున్నాం. అన్నారు.

# 'తిమ్మరాజుపల్లి టీవీ' 'టీవీ వీడియో సాంగ్' రిలీజ్



న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా "తిమ్మరాజుపల్లి టీవీ". తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్‌గా పరిచయమవుతున్నారు. "తిమ్మ రాజుపల్లి టీవీ" చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "తిమ్మరాజుపల్లి టీవీ" సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'టీవీ వీడియో సాంగ్' రిలీజ్ చేశారు. టీవీ, డిష్ వచ్చిన కొత్తలో పల్లెటూరి ప్రజలు ఎంత ఆసక్తిగా ఆ ప్రసారాలు చూశారో ఈ పాటలో చిత్రీకరించారు. టీవీ ఇంటికి వచ్చిన రోజు ఆ ఇంటివారికే కాదు ఆ ఊరిలో టీవీ లేని వారందరికీ పండుగ రోజే. ఊరిలో మొదట టీవీ కొనడం మామూలు గొప్పకాదు, టీవీ ఉన్న ఇంటికి వెళ్లి మిగతా వారంతా సీరియల్స్, సినిమాలు చూసేవారు. ఈ సందడిని పాటలో తెలియ జేస్తూ సనరే సాహిత్యాన్ని అందించారు. వంశీకాంత్ రేఖన సంగీతాన్ని అందిం చగా, స్వరాజ్ కీర్తన్ పాడారు.'టీవీ వీడియో సాంగ్' ఎలా ఉందో చూస్తే – 'సూడు సూడు సిత్తరాలు, నట్టింట్లోకొచ్చె సినిమా హాలు, సూడు సూడు సీరియళ్లు, మరి చాలవంట రెండు కళ్లూ, ఎవడంటా మొట్టమొదట టీవీ తెచ్చింది, ఊరంతా మోతమోగాలా, తెరమీద చిందులకు మతిపోయిందంటూ, పడనోళ్ల గుండె పగిలి గుక్కె పట్టి ఏడ్చేయాల....' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

# 22న ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి రెండో పాట విడుదల



పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్‌పై అభిమా నుల్లో అంచనాలు రోజురోజుకీ పెరు గుతున్నాయి. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది మార్చి 26న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే నిర్మాణ సంస్థ అధి కారికంగా ప్రకటిం చింది. ఈ చిత్రం నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన తొలి పాట 'దేఖ్లేంగే సాలా' ఫ్యాన్స్‌ను ఫిదా చేయగా.. ఇప్పుడు రెండో సింగిల్ విడుదలకు చిత్రబృందం సిద్ధమైంది.

ఆరా ఆఫ్ ఉస్తాద్ పేరుతో రానున్న ఈ పవర్‌ఫుల్ యాంథమ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా తాజాగా కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. యాక్షన్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామా మిక్స్‌తో ఈ చిత్రం భారీ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజా పోస్టర్‌లో పవన్ కల్యాణ్ ఎదుట భారీ జనసముద్రం కనిపించడం కట్టుకుంటుండగా.. ప్రస్తుతం అది సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. గబ్బర్ సింగ్ తర్వాత పవన్ – హరీష్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటం, పైగా డీఎస్పీ సంగీతం అందిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**